RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్ : పి. సైదులు, సంపుటి : 02 సంచిక : 363 మంగళవారం 25-11-2025 పేజీలు : 8

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారోకు 27 ఏళ్ల జైలు శిక్ష

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు 27 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది. 2022 ఎన్నికల్లో ఓటమి తర్వాత అధికారాన్ని నిలుపుకోవడానికి కుట్ర పన్నారన్న కేసులో ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తిరస్కరించింది. శిక్షను వెంటనే అమలు చేయాలని ఆదేశించడంతో ఆయన జైలు జీవితం గడపడం అనివార్యమైంది.గత శనివారం గృహ నిర్బంధంలో ఉన్న బోల్సోనారో, తన కాలికి ఉన్న యాంకిల్ మానిటర్‌తో ట్యాంపరింగ్ చేశారన్న ఆరోపణలతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. తాను వాడే మందుల వల్ల భ్రాంతులు, భయాందోళనలు కలుగుతున్నాయని, ఆ పరికరం ద్వారా తనపై గూఢచర్యం చేస్తారేమోనన్న అనుమానంతో అలా చేశానని ఆయన అధికారులకు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఆయన ఆరోగ్య కారణాలతో గృహ నిర్బంధాన్ని కోరుతూ చేసిన విజ్ఞప్తిని కూడా కోర్టు తోసిపుచ్చింది.సెప్టెంబర్‌లో వెలువడిన తీర్పులో బోల్సోనారోతో పాటు ఆయన ఏడుగురు మిత్రులను సుప్రీంకోర్టు దోషులుగా నిర్ధారించింది. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడం, అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా ప్రమాణ స్వీకారానికి ముందే ఆయనను హత్య చేయడం, సుప్రీంకోర్టును రద్దు చేసి సైన్యానికి అధికారాలు కట్టబెట్టడం వంటి భారీ కుట్రకు పాల్పడినట్లు ప్రాసిక్యూటర్లు కోర్టుకు ఆధారాలు సమర్పించారు.

- మూడు విడతల్లో తెలంగాణ పంచాయతీ ఎన్నికలు
- ఫేజ్ 1 : నవంబర్ 27 నుండి నామినేషన్ స్వీకరణ.. డిసెంబర్ 11న పోలింగ్
- గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు
- ఎన్నికల తేదీలు ప్రకటించిన ఎస్ఈసీ

# తెలంగాణలో మోగిన పంచాయితీ ఎన్నికల నగారా..






**తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది.. తెలంగాణ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇప్పటికే రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి పూర్తి వివరాలు ఇవ్వడంతో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 11,14, 17 తేదీల్లో మూడు విడతల్లో ఈ ఎన్నికలు నిర్వహించనుండగా.. ప్రతి ఫేజ్‌కి నడుమ రెండు రోజుల వ్యవధి ఉంటుంది.**

ఈ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల కమిషనర్ రాణి కుముదుని ప్రకటించారు. మొదటి విడత పంచాయితీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 27 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతకు నవంబర్ 30న, మూడో విడతకు డిసెంబర్ 3న నుంచి నామినేషన్లు స్వీకరించారు. పోలింగ్ జరిగిన రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు ఎస్ఈసీ చెప్పారు.

**పంచాయతీ ఎన్నికల తేదీలు ఇవే :**

పంచాయతీ ఎన్నికలను డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లుగా రాణి కుముదిని వివరించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని రాణి కుముదిని స్పష్టం చేశారు.

**పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల – పోలింగ్ తేదీలు ఇవే**

"సెప్టెంబర్ 29వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9వ తేదీన షెడ్యూల్‌పై స్టే విధించారు. ఇవాళ రినోటిఫికేషన్‌కు కొత్త షెడ్యూల్‌ను ఇచ్చాం. గ్రామపంచాయితీలు, వార్డు వివరాలు పోలింగ్ స్టేషన్లు, రిజర్వేషన్లు తదితర వివరాలు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. ఇవాళ్టి నుంచే ఎన్నికల

మిగతా 2లో



## కస్టడీలో జరిగే హింస, మరణాలు వ్యవస్థకే మచ్చ- దీనిని దేశం సహించదు: సుప్రీంకోర్టు

- కస్టడీ మరణాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- వీటిని ఎవరూ సమర్థించలేరని వ్యాఖ్య

పోలీస్ కస్టడీలో జరిగే హింస, మరణాలు వ్యవస్థకే 'మచ్చ' అని, దీనిని దేశం సహించదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పోలీసు స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయకపోవడాన్ని సుమోటో కేసుగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం దానిపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాజస్థాన్‌లో గడచిన 8 నెలల్లో పోలీసు కస్టడీలో 11 మరణాలు నమోదయ్యాయని పేర్కొంది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఈ కేసు విచారణ

మిగతా 2లో

## జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు విలీనం

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
- సుమారు 4 గంటలకు పైగా కేబినెట్ సమావేశం
- కీలక అంశాలపై చర్చించిన మంత్రివర్గం
- సమావేశం అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రులు




**హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.దపెద్ద అంబర్ పేట్, జల్‌పల్లి, తుర్కయంజాల్, శంషాబాద్‌లు, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, దమ్మాయి గూడ, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జీగిర్, మీర్‌పేట్, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనం కాబోతున్నాయి. మరోవైపు మూడో డిస్కం ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా 3 వేల మెగావాట్ల

మిగతా 2లో



## శతాబ్దాల నాటి గాయాలు ఇవాళ నయం అయ్యాయ్ - అయోధ్యలో ప్రధాని మోదీ

**భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచింద్న మోదీ**

**అయోధ్య :** అయోధ్యలో ఎగురవేసిన ధర్మధ్వజం కేవలం జెండా మాత్రమే కాదని భారతీయ సాంస్కృతిక పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అయోధ్యలో ధ్వజారోహణం అనంతరం జైశ్రీరామ్ నినాదంతో మోదీ ప్రసంగాన్ని ప్రారంభించారు. రామ భక్తుల సంకల్పం సిద్ధించిందని వ్యాఖ్యానించారు. శతాబ్దాల గాయాలు, బాధలు నేడు నయమైనట్లు, 500 ఏళ్ల నాటి తీర్మానం నెరవేరినట్లు తెలిపారు. రామరాజ్య వైభవాన్ని ఈ జెండా ప్రతిబింబిస్తుందని, శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి

మిగతా 2లో

## ఢిల్లీలో వాయు కాలుష్యం.. రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం




2



2

## డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ సమావేశాలు.. ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

## రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో అదానీ, అంబానీని దాటి పోవాలనుకుంటున్నారు: కేటీఆర్



2లో

- రూ.4 లక్షల కోట్లకు పైగా భూకుంభకోణం చేయాలని చూస్తున్నారని ఆరోపణ
- రేవంత్ రెడ్డి తన మునిమనవలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి వెనుకేసుకోవాలని చూస్తున్నారని విమర్శ
- తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్న కేటీఆర్



2లో

## కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు... తాజాగా 28 మంది సరెండర్

# తెలంగాణలో మోగిన పంచాయితీ ఎన్నికల నగారా..

నియమావళి అమల్లోకి వస్తుంది. ఈ ఎన్నికలను మూడు ఫేజ్‌లలో నిర్వహించాలని నిర్ణయించాం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు మొదటి దశలో ఎన్నికలను నిర్వహిస్తాం"– రాణి కుముదిని, ఎన్నికల కమిషనర్

**పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఈనెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ :**

నవంబర్ 27వ తేదీ నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నట్లుగా ఎన్నికల కమిషన్ తెలిపింది. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనుండగా మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్‌ను నిర్వహించనున్నట్లుగా ఎస్ఈసీ తెలిపింది.

**పంచాయతీ ఎన్నికల ముఖ్య తేదీలు ఇవే :**

మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు
12,728 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
1,12,242 వార్డు స్థానాలకు ఎన్నికలు
డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
పోలింగ్ రోజే మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు
ఎల్లుండి నుంచి తొలి విడత నామినేషన్ల స్వీకరణ

**తొలి విడతలో 4,236 సర్పంచ్ స్థానాలకు :**

రెండో విడత ఎన్నికలకు ఈనెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ
మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ
ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
తొలి విడతలో 4,236 సర్పంచ్ స్థానాలకు 37,440 వార్డులకు పోలింగ్
రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు 38,350 వార్డులకు పోలింగ్
రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు 38,350 వార్డులకు పోలింగ్

# జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు విలీనం

సోలార్ విద్యుత్ కొనుగోలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**కేబినెట్ నిర్ణయాలివే..**

1. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీ %+ఎవీజ%లో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

2. రాష్ట్రంలో ఇప్పుడున్న %చీూఙజూ, ూూఙజూ% రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి.

3. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేళ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాపై కేబినెట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్ విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.
ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది.

4. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.

5. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.
ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది.

6. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్ లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది.. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో.. ముందుగా అంచనాలు వేసుకుని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

7. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14,725 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించి.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది.

8. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

9. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

10. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీలతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం..

# కస్టడీలో జరిగే హింస, మరణాలు వ్యవస్థకే మచ్చ- దీనిని దేశం సహించదు: సుప్రీంకోర్టు

చేపట్టింది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, కస్టడీ మరణాలను ఎవరూ సమర్థించరని, సమర్థించడానికి కూడా ప్రయత్నించలేరని అన్నారు.

**ఎందుకు అంత తేలికగా తీసుకుంటున్నారు?**

కస్టడీ మరణాలపై కేంద్రం ఎందుకు అఫిడవిట్ దాఖలు చేయలేదని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "కేంద్రం ఈ కోర్టును ఎందుకు తేలికగా తీసుకుంటోంది?" అని జస్టిస్ విక్రమ్ నాథ్ అడిగారు. దీనితో 'కోర్టును ఎవరూ తేలికగా తీసుకోలేరని' తుషార్ మెహతా అన్నారు. కేంద్రం మూడు వారాల్లోగా కంప్లియెన్స్ అఫిడవిట్ దాఖలు చేస్తుందని చెప్పారు.
'2025లో మొదటి ఎనిమిది నెలల్లో రాజస్థాన్‌లో పోలీస్ కస్టడీలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వాటిలో 7 ఘటనలు కేవలం ఉదయ్ పుర్ డివిజన్‌లోనే జరిగాయి' మీడియాలో కథనాలు వచ్చాయి. దీనితో సుప్రీంకోర్టు సెప్టెంబర్ నెలలో దీనిని సుమోటోగా స్వీకరించింది.
వాస్తవానికి 2018లోనే సుప్రీంకోర్టు పోలీసు స్టేషన్లకు కీలక ఆదేశాలు జారీ చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనలను తనిఖీ చేయడానికి వీలుగా పోలీసు స్టేషన్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది.
ఇక మంగళవారం సుప్రీంకోర్టు మరో కేసు (2020 ఉత్తర్వులు) విషయంలో అమికస్ క్యూరీగా సుప్రీంకోర్టుకు సాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు కూడా విన్నది. ఈ క్రమంలోనే సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సహా అన్ని దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలు, రికార్డింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.
అమెరికాలో ప్రత్యక్ష ప్రసారం
విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికాలోని పోలీసు స్టేషన్లలో, జైళ్లలోని జరిగే వాటిని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని పేర్కొంది. దీనితో 'అమెరికాలో దాదాపు రిసార్ట్ స్థాయి సౌకర్యాలు అందిస్తున్న ప్రైవేట్ జైళ్లు కూడా ఉన్నాయని' సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు.
"కస్టడీలో హింస, మరణాలపై సమోటో రిట్ పిటిషన్‌పై 11 రాష్ట్రాలు మాత్రమే సమ్మతి అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా అఫిడవిట్‌లను దాఖలు చేయలేదు. ఇందులో యూనియన్ ఆఫ్ ఇండియా కూడా ఉంది" అని సర్వోన్నత న్యాయస్థానం తన ఉత్తర్వులో పేర్కొంది.
అందుకే ఇంకా అఫిడవిట్లు దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మూడు వారాల సమయం మంజూరు చేస్తూ, తదుపరి విచారణను డిసెంబర్ 16కు వాయిదా వేసింది. ఒకవేళ గడువులోగా అఫిడవిట్లు దాఖలు చేయకపోతే, ఆ రాష్ట్రాల, యూటీల హోంశాఖలోని ప్రధాన కార్యదర్శులు కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# శతాబ్దాల నాటి గాయాలు ఇవాళ నయం అయ్యాయ్ - అయోధ్యలో ప్రధాని మోదీ

చాటుతుందని అన్నారు. అసత్యంపై చివరికి సత్యం విజయం సాధిస్తుంది అనడానికి ఈ పవిత్ర జెండా నిదర్శనంగా నిలుస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. దేశం, ప్రపంచం రామమయంగా మారిందని అన్నారు. ఈ మహోన్నత సందర్భంలో రామభక్తులను, రామమందిర నిర్మాణంలో సాయం చేసిన వారందరినీ అభినందిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని అప్పటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మోదీ అన్నారు.
"శతాబ్దాల నాటి గాయాలకు ఇవాళ ఉపశమనం లభించింది. ఐదు శతాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ధర్మధ్వజంపై ఉన్న కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీక. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచింది. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. రామాలయ నిర్మాణ యజ్ఞానికి ఇవాళ పూర్ణాహుతి. ధర్మధ్వజం కేవలం జెండా మాత్రమే కాదు. ఈ ధర్మధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నం. ఈ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుంది. ఈ ధర్మధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెప్తుంది. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నాం. ధర్మధ్వజాన్ని దూరం నుంచి చూసినా రాముడిని చూసినంత పుణ్యం వస్తుంది. కోట్లాది మంది రామభక్తుల కల ఇవాళ సాకారమైంది. రామమందిర నిర్మాణానికి సహకరించిన అందరికి నమస్కరిస్తున్నా" "మనచుట్టూ కొందరు బానిస భావజాలం ఉన్నవారు ఉన్నారు. బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. బానిస భావజాలం ఉన్న వ్యక్తుల నుంచి విముక్తి పొందాలి. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు భారత్. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెప్తోంది. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని బానిస భావజాలం ఉన్నవారు చెబుతున్నారు. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుంది. అయోధ్య రాముడిని ఇప్పటికే 45 కోట్ల మంది దర్శించుకున్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగాడో అయోధ్య చెప్తుంది. రాముడు కులం చూడడు, భక్తి మాత్రమే చూస్తాడు. ఆదర్శ పురుషుడు శ్రీరాముడికి బేధభావాలు ఉండవు. క్షమాగుణాన్ని మించిన గొప్ప గుణం మరొకటి లేదు." ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు అయోధ్యలో ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభమని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామభక్తులకు ఇది ఎంతో శుభదినమని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణంతో అయోధ్యకు అనుసంధానం పెరిగిందన్నారు. అయోధ్య బాలరాముడి గర్భగుడిపై కషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఎగురవేసిన ప్రధాని మోదీకి, ఉత్తర్‌ప్రదేశ్ ప్రజల తరపున యోగి అదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. అయోధ్య నగరం కోసం ప్రత్యేకంగా సోలార్ ప్లాంట్ల నిర్మాణం జరిగిందని విద్యుత్‌లో స్వయం సమృద్ధి సాధించిందని యోగి ఆదిత్యనాథ్ వివరించారు. "మర్యాద పురుషోత్తముడు శ్రీరామ భగవానుడి భవ్య మందిరంపై ధ్వజారోహణం ఒక యజ్ఞం పరిపూర్ణమవడమే కాదు ఒక కొత్త యుగానికి శుభారంభం. ఈ కార్యక్రమాన్ని పరిపూర్ణం చేసేందుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఉత్తరప్రదేశ్ ప్రజలు, రామ భక్తులందరి తరపున అభినందనలు తెలపడానికి సంతోషిస్తున్నాను." అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఎంతోకాలంగా వేచి చూస్తున్న రామాలయ ధ్వజారోహణం ఘనంగా జరిగింది. గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. సీతారాముల కళ్యాణం జరిగిన మార్గశిర మాసం శుక్లపంచమి రోజున అభిజిత్ ముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమం జరగడం విశేషం. 17వ శతాబ్దంలో అయోధ్యలో నిర్విరామంగా 48 గంటలపాటు ధ్యానం చేసిన సిక్కుల ఆరో గురువు తేజ్ బహదూర్ అమరత్వం పొందిన రోజు కూడా ఇదే కావడం గమనార్హం. 2020 ఆగస్టు 5న రామమందిరం నిర్మాణానికి భూమిపూజ, అయోధ్యలో 2024 జనవరి 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగాయి. రామ్‌లల్లా ఆలయంపై ఏర్పాటు చేసిన కాషాయ ధ్వజం త్రిభుజాకారంలో 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు ఉంది. జెండాపై ఆధ్యాత్మిక ధ్వనికి ప్రతీకగా 'ఓం' అక్షరాన్ని రాముడి సూర్యవంశ వంశానికి సూచికగా 'సూర్యుడు', కశ్యప మహర్షి మందార, పారిజాత మొక్కలను కలిపి సృష్టించిన 'కోవిదార్ చెట్టు' చిహ్నాలను ఉంచారు. వాల్మీకి రామాయణం అయోధ్య కాండలోనూ ఈ జెండా గురించి ప్రస్తావన ఉందని ప్రముఖ సాంస్కృతిక వ్యవహారాల పరిశోధకుడు లలిత్ మిశ్రా గుర్తించారు. ఆ సమాచారం మేరకే ఈ జెండాను రూపొందించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గల పారాచ్యూట్ తయారీ సంస్థ ఈ జెండాను తయారుచేసింది. సుదీర్ఘకాలం మన్నేలా పారాచ్యూట్ గ్రేడ్ వస్త్రంతో, పట్టుదారాలతో 25 రోజుల పాటు శ్రమించి దీన్ని తీర్చిదిద్దారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యిందనే దానికి సంకేతంగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గతేడాది జనవరి 22న ఈ ఆలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

**7 వేల మంది ప్రత్యేక అతిథులు**

ధ్వజారోహణ వేడుక కోసం సుమారు 100 టన్నుల రకరకాల పూలతో ఆలయాన్ని, నగరంలోని మార్గాలను సుందరంగా అలంకరించారు. దాదాపు 7 వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. అతిథులంతా ఈ వేడుకలను వీక్షించేందుకు 200 అడుగుల వెడల్పు గల ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అద్భుత ఘట్టం ఆవిష్కృతమైన సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అయోధ్య పర్యటనలో భాగంగా హర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగా ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య మోదీ రోడ్ షో నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఆయనకు స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. రోడ్‌షో తర్వాత రామజన్మభూమి ఆలయంలో శేషావతార్ మందిరంలో మోదీ ప్రత్యేక పూజలు చేశారు.
అనంతరం కొత్తగా నిర్మించిన సప్త మందిర్‌ను మోదీ సందర్శించారు. ఇందులో మహర్షులైన వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, అహల్య, నిషాదరాజ్ గుహ, మాతా శబరి విగ్రహాలు, ఆలయాలు ఉన్నాయి. దీంతోపాటు మాతా అన్నపూర్ణాదేవికి కూడా పూజలు చేశారు. ఆ తర్వాత ప్రధాని మోదీ గర్భగుడిలో బాలరాముడికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అది జరిగాక గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని మోదీ ఎగురవేశారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం.. రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం

**ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం**

**కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచన**

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకరంగా పడిపోతున్న నేపథ్యంలో పీఎంవో రంగంలోకి దిగింది. కాలుష్యానికి కారకమయ్యే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు చర్యలు ముమ్మరం చేయాలని సూచించింది.
ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఢిల్లీలోని వాయు నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వాహనాల కాలుష్యం ప్రధానాంశంగా ప్రస్తావనకు వచ్చింది. దేశ రాజధానిలో ఇంకా 37 శాతం మేర పాత వాహనాలు వినియోగంలో ఉన్నట్లు సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వాటి స్థానంలో ఈవీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఈవీ వాహనాలకు రాయితీలు ఇవ్వడంతో పాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. కాలుష్య కారక పెట్రోల్, డీజిల్ వాహనాలు వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

# డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ సమావేశాలు.. ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

**- పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు సర్వం సిద్ధం**

**- సభ సజావుగా సాగేందుకు కేంద్రం కసరత్తు**

**- ఓటర్ల జాబితా సవరణ అంశంపై కేంద్రాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు**

డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా చూసేందుకు అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నవంబర్ 30వ తేదీన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీలో ప్రభుత్వం చర్చకు తీసుకురావాలనుకుంటున్న బిల్లులు, ఇతర ముఖ్యమైన అంశాలపై విపక్షాలకు వివరించి, వారి సహకారం కోరనుంది. డిసెంబర్ 1 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉంటాయి. అయితే, ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని సభలో బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సభలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం వంటి అంశాలపై చర్చించేందుకు విపక్షాలు కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద, ఈ సమావేశాలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో అదానీ, అంబానీని దాటి పోవాలనుకుంటున్నారు: కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే దెబ్బతో అదానీ, అంబానీలను దాటిపోవాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పారిశ్రామిక వాడల భూములను విక్రయించి రూ. 4 లక్షల కోట్లకు పైగా భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తమ మునిమనవలు, వారి మునిమనవలు కూడా కూర్చుని తిన్నా తరగని ఆస్తిని వెనుకేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ భూకుంభకోణానికి తెరలేపారని అన్నారు.
తక్కువ ధరకు 9,292 ఎకరాలను ధారాదత్తం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఇదివరకు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములలో ప్రైవేటు వ్యక్తులు అపార్టుమెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతిస్తోందని అన్నారు. గత ఐదారు దశాబ్దాలుగా హైదరాబాద్ నగరంలో 21 పారిశ్రామిక వాడలు ఏర్పడ్డాయని ఆయన గుర్తుచేశారు. ప్రజల భూములను తీసుకుని ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చాయని, నగరం విస్తరించడంతో పరిశ్రమలు నగరం మధ్యలోకి వచ్చాయని తెలిపారు.
బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీల ఏర్పాటుకు గ్రిడ్ పాలసీని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వాడల భూములను విక్రయించి రూ.4 లక్షల కోట్లకు పైగా కుంభకోణం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 9,292 ఎకరాల భూమిని ధారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని ఆయన మండిపడ్డారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదేనని, ముఖ్యంగా విద్యార్థులు ఈ దిశగా దృష్టి సారించాలని అన్నారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు.
అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికి న్యాయం జరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణపై బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని అన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఉద్ఘాటించారు.

# కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు... తాజాగా 28 మంది సరెండర్

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ**

**లొంగిపోయిన వారిలో 19 మంది మహిళలు**

**వీరిపై రూ. 89 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి**

**'పున మర్గం' కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నాయన్న అధికారులు**

**ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోలు**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు.
కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాడ్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు.
లొంగిపోయిన వారిలో ముగ్గురు ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు.
గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నూతన వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కు సన్మానం

### వాసవి క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్ ఆధ్వర్యం లో




**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 25** నూతన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 101 ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్గా 2026 సంవత్సరమునకు నూతనంగా ఎన్నికైన వాసవియన్ మంచాల విజయ్ కుమార్ తొర్రూరుకు విచ్చేసిన సందర్భంగా సి ఎన్ కే ఇన్ఫ్రా డెవలపర్స్ కార్యాలయం లో క్లబ్ అధ్యక్షుడు శ్రీ చిదిరాల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో విజయకుమార్ ని శాలువా తో ఘనంగా సత్కరించడం అయినది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు శ్రీ ప్రొద్దుటూరు గౌరీ శంకర్ , వాసవి క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ గోపారపు రామ ఉపేందర్ , వాసవి క్లబ్ ఆర్సి బిజ్జాల అనిల్ కుమార్ తొర్రూరు వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీ చిదిరాల నవీన్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాంబాబు గారు, కోశాధికారి గోపారపు నిరంజన్ వాసవి క్లబ్ బాధ్యులు బిజ్జాల వెంకటరమణ గారు, బోనగిరి వేణు మాధవ్ గారు, మహంకాళి వెంకటేశ్వర్లు నూతన గవర్నర్ మంచాల విజయ్ కుమార్ గారికి శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. క్లబ్ ఉన్నతికి సేవా కార్యక్రమాలకు తాము సహకరిస్తామని గవర్నర్ కు తెలిపారు.

## లక్ష విలువచేసే 20 డ్యుయల్ డెస్క్ బెంచిలు,టై బెల్ట్ లు పాఠశాలకు బహుకరించినబిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రామడుగు అచ్యుతరావు

### కృతజ్ఞతలు తెలిపిన సీతారాంపురం పాఠశాల హెచ్.ఎం అర్జున్ నాయక్







**మరిపెడ తొలి అక్షరం నవంబర్ 25**మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీతారాంపురం నందు విద్యార్థులకు దాత రామడుగు అచ్యుత్ రావు దాతృత్వం తో సుమారు లక్ష రూపాయల విలువ చేసే 20 డ్యుయల్ డెస్క్ బెంచిలు, విద్యార్థులకు టై బెల్ట్ లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు గుగులోత్ అర్జున్ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మరిపెడ మండల విద్యాశాఖ అధికారిణి గాదె అనితా దేవి,సీతారాంపురం సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ సునీల్ కుమార్ లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పై దాతలు ఔదార్యం అభినందనీయమని అన్నారు. దాతలు స్పందించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.మంగీలాల్, లింగాల మహేష్ గౌడ్,కవిత, వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, సందీప్ కుమార్,సారిక,సిఆర్పీ జానకిరాములు పాల్గొన్నారు.

## బురహాన్ పురంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

### పాల్గొన్న కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు



**మరిపెడ తొలి అక్షరం నవంబర్ 25**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురహాన్ పురం గ్రామంలో డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు యాదవ్, మరిపెడ కాంగ్రెస్ మండల నాయకులు కోట వెంకటరెడ్డి పాల్గొని గ్రామం లోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఐలమల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల కు పెద్దపీట వేస్తుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళ ను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ మహిళలకు సమాజంలో గౌరవ స్థానాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వము అన్నారు. ఈ సందర్భంగా మహిళలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కోట వెంకటరెడ్డి, గ్రామ నాయకులు పెద్ద గొల్ల కొమరయ్య యాదవ్, సూత్రపు వెంకన్న,కోట శ్యాంసుందర్ రెడ్డి, గడ్డం వీరారెడ్డి, ఆబోతు పాల వెంకన్న, కోట వీరారెడ్డి, చాపల కొమర మల్లు, సూత్రపు భాస్కర్, బండారి తిరుపతయ్య, మహిళా సంఘ ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులపై పెరుగుతున్న దాడులు

-భయాందోళనలో డ్రైవర్లు, కండక్టర్లు

-మహిళా కండక్టర్ల భద్రత ప్రశ్నార్థకం

-భద్రత కల్పించాలని ఎస్సీ, ఎస్టీ యూనియన్ డిమాండ్

-టీఎస్ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ జోనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రమేశ్ నాయక్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),నవంబర్25:**రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు రోజురోజుకు పెరుగుతుండటంపై ఎస్సీ, ఎస్టీ టీఎస్ఆర్టీసీ జోనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రమేశ్ నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా 'మహాలక్ష్మి' ఉచిత టికెట్ల పథకం అమలు నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురిచేస్తూ, తమ సిబ్బందిపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కరీంనగర్ దాడి ఘటనపై నిరసన:**

మొన్న కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంటలో విధి నిర్వహణలో ఉన్న ఒక డ్రైవర్‌పై జరిగిన దాడిని ఈ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ దాడుల వల్ల ఉద్యోగం చేయాలంటేనే భయాందోళనతో గడపాల్సి వస్తోందని, నిత్యం భార్యాపిల్లలను వదిలి ఉదయం 5 గంటలకే డ్యూటీకి వస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో తమపై దాడులు జరిగితే ఉద్యోగాలు మానేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మహిళా కండక్టర్ల భద్రత ప్రశ్నార్థకం:**

హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో మహిళా కండక్టర్లపై కూడా ప్రయాణికులు దురుసుగా ప్రవర్తించడం, కొట్టి గాయపరచడం వంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయని, దీంతో మహిళా ఉద్యోగులు కూడా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వారు తెలిపారు.

**ఎండీ నాగిరెడ్డి కి వినతి:**

ఈ పరిస్థితులపై టీఎస్ఆర్టీసీ గౌరవనీయులు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నాగిరెడ్డి కి ఎస్సీ, ఎస్టీ యూనియన్ తరఫున ప్రత్యేక విన్నపం చేశారు.తమ సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవాలని, అధికారులు మరియు అన్ని డిపార్ట్‌మెంట్ల వారు జోక్యం చేసుకుని ఆర్టీసీ ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఇకముందు విధి నిర్వహణలో ఉన్న తమ సిబ్బందిపై దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, తమకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....మేము ఈ చిన్న ఉద్యోగంపై ఆధారపడి మా పిల్లలను చదివించుకుంటూ, వారి భవిష్యత్తుకు ఆధారం కల్పించాలని కష్టపడుతున్నాము.బస్సులో 100 మంది ప్రయాణికులు ఉన్నా కూడా, బస్సు ఆపలేదంటూ ఎదురుగా వచ్చి మాపై దాడి చేస్తున్నారు. దయచేసి ఎండీ మా బాధను అర్థం చేసుకుని, మాకు న్యాయం చేస్తారని కోరుకుంటున్నాము అని అన్నారు.

# మత్స్య కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం

### -పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి





**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 25** మత్స్యకారులకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.తొర్రూరు మండలంలోని అమ్మాపురం పెద్ద చెరువులో మత్స్యశాఖ 100 రాయితీతో ఉచిత చేప పిల్లలను మంగళవారం టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మత్స్యశాఖ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధియే ధ్యేయంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేప పిల్లలు పంపిణీ చేసినట్లు తెలిపారు,అన్ని కుల వృత్తుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలోని చెరువులలో చేప పిల్లలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముదిరాజులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ముదిరాజుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 350 చెరువులు 72 సొసైటీలు,4099 మంది సభ్యులు ఉన్నారని అన్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు కుంటలు మత్తడిపడి, తెగిపోవడం వల్ల మత్స్య కార్మికులకు నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు.అమ్మాపురం చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని నిధులు కేటాయించి కట్ట నిర్మించాలని కోరారు. నిరుపేద మత్స్యకారులకు 15 డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, ముదిరాజుల గుడి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి జనగాం శివప్రసాద్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ముత్తినేని సోమేశ్వరరావు,ఎంపీడీవో కూస వెంకటేశ్వర్లు,ఏఎంసీ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి, కంచర్ల వెంకటాచారి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు మహబూబ్ రెడ్డి, ముద్దం విక్రం రెడ్డి, జూలూరు జగన్,అరవింద్, ముదిరాజ్ జిల్లా డైరెక్టర్లు ధనుంజయ్, నాగరాజు,నాయకులు ఉపేందర్, రమేష్, బ్రహ్మయ్య,బిక్షం,సాయిలు రాజు బాలయ్య, వీరేష్ నారాయణ, మత్స్యశాఖ అధికారులు శ్రీనివాస్, విష్ణు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్

### ప్రధానమంత్రికి వినతిపత్రం

### సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్రం స్పందించకపోవడంపై టీఎస్ యూటీఎఫ్ ఆవేదన

### టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 25**సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ )నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, టీఎస్ యూటీఎఫ్ తొర్రూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రికి ఇమెయిల్ ద్వారా వినతిపత్రాలు సమర్పించారు.స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్. టి. ఎఫ్. ఐ) పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టు తీర్పు వెలువడి రెండు నెలలు గడుస్తున్నా, కేంద్ర ప్రభుత్వం తీర్పుపై సమీక్షకు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పిస్తామనే భరోసా కూడా ఇవ్వడం లేదు" అని మురళీకృష్ణ అన్నారు. ఆయన మరింత స్పష్టం చేస్తూ, ఎన్సీటీఈ నోటిఫికేషన్ ప్రకారం 2010 ఆగస్టు 23కు ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని స్పష్టంగా పేర్కొనబడింది. ఈ నేపథ్యంలో, గత 15 సంవత్సరాలుగా తాము టెట్ రాయాలనే ఆలోచన చేయలేదని తెలిపారు.డీఎస్సీ పరీక్ష వ్రాసి, నిబంధనల ప్రకారమే ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఇప్పుడు అర్హత పరీక్ష (టి ఈ టి)వ్రాయాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఇది సీనియర్ ఉపాధ్యాయులను అవమానించడమే" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి, సీనియర్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపునిస్తూ, రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చట్టం తీసుకురావాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు.ఈ చట్టం రూపకల్పనలో పార్లమెంటు సభ్యులు అందరూ తమ వంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో ఏ. మురళి కృష్ణ, ఈ. రమేష్, యు. వెంకటేశ్వర్లు, కె. జనార్ధన్, కె. వెంకన్న, ఓ. చైతన్య, బి. పార్వతీ రాథోడ్, వంశీకృష్ణ, రంజిత్ కుమార్, రజినీకాంత్, యాకస్వామి, మహేందర్, బి. మహేష్, పి. ప్రశాంత్, పల్లవి, రాజన్న తదితరులు ఉన్నారు.

# చెర్లపాలెం లో యాదవ సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన




### సేవా కార్యక్రమాలు చేపడతామని మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ హామీ

### ట్రస్ట్ అధినేత తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 25**తొర్రూర్ మండలంలోని చెర్లపాలెం గ్రామంలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంగళవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి తమ సొంత నిధులు కేటాయించి, అనుమాండ్ల మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. చర్లపాలెం గ్రామస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చర్లపాలెం గ్రామ అధ్యక్షుడు ఎక్కటి నాగిరెడ్డి, గ్రామ నాయకులు జినుగా రవీందర్ రెడ్డి, ధర్మారపు మహేందర్, చిట్టిమల్ల మహేష్, ఎద్దు మహేష్ యాదవ్ మరియు యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామకృష్ణ సేవా సమితి,ఆర్య జనని ఆధ్వర్యంలో గర్భిణీలకు అవగాహనా సదస్సు







ఆర్యజనని వర్క్ షాప్ ఓ అద్భుతమైన సామాజిక సేవ అని, రామకృష్ణ సేవాసమితి హనుమకొండ,ఆర్యజనని ట్రస్ట్ హైదరాబాద్ వారు సంయుక్తంగా ఈ అవగాహనా సదస్సును నిర్వహించడం ప్రశంసనీయమని గే)టర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేయర్ పాల్గొనడం చాలా ఆనందంగా యుందన్నారు.ఇదే రోజు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,నీలిమల కుమారుడు కీ.శే. నాయిని విశాల్ రెడ్డి దశాబ్ది వర్ధంతి సందర్భం కావడం వారి సౌజన్యంతో ఈ వేదిక జరుపుకోవడం ప్రశంస నీయమని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. నాయిని విశాల్ రెడ్డి తల్లి నీలిమ-రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరామకృష్ణ సేవా సమితి వారు నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలేవైనా నిస్వార్ధ సేవా దృక్పతంతో చేస్తున్న కార్యక్రమాలని తమ సహాయ-సహకారాలుంటాయని అన్నారు. గర్భస్థ శిశువు తల్లి యొక్క జీవన విధానాన్ని, దినచర్యను బట్టి శిశువు ప్రవర్తన వస్తుందని ఆరోగ్యవంత మైన జీవనశైలిలో భాగంగా గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంతో పాటు యోగ, ధ్యానాన్ని అలవర్చుకునే విధంగా అవగాహన కల్పించాలని ప్రముఖ గైనకాలజీ డాక్టర్ సంధ్యా రాణి అన్నారు.హనుమకొండ అంబెడ్కర్ భవన్ లో ఐసిడిఎస్ సూపర్వైజర్లకు,అంగన్వాడీ టీచర్లకు క్షేత్రస్థాయిలో గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలపై జరిగిన శిక్షణ శిభిరంలో ప్రముఖ వైద్య నిపుణులు శివ సుబ్రహ్మణ్యం,లక్ష్మీనారాయణ, గైనకాలజిస్ట్ సౌమ్య ,పిల్లల డాక్టర్ అశోక్ రెడ్డి,హోమియోపతి డాక్టర్లు పాల్గొన్నారు. ఆరోగ్యవంతంగా ఉండేందుకు గర్భిణులు,బాలింతలకు ఉపయోగపడే యోగ,ధ్యానం ఆసనాలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పౌష్టికాహారం గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్లకు సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన గర్భిణీ మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు.గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం,యోగాసనాలు,ధ్యానం,ఇతర ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన వివిధ అంశాల గురించి ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మూడు పద్ధతులను గర్భిణీ స్త్రీలు పాటించడం వలన శే)ష్టమైన సంతానం కలుగుతుందని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో పా)రంభమైంది. శుశువు గర్భస్థ శిశువు దశనుండి ఆ శిశువు ఎదిగిన పరిణామక్రమం, తీరుతెన్నుల గురించి ఆర్యజనని టీమ్ సభ్యుల ప్రత్యక్ష డెమో అందరి మన్ననలు పొందింది. జిల్లా శిశు సంక్షేమాధికారి,జయంతి,ఆర్యజనని సమన్వయకులు ఆనేటి దశరథం, సేవా సమితి సభ్యులు, విష్ణువర్ధన్ రెడ్డి, కేవిరావు, తిరువరంగం ప్రభాకర్, సూర్య, అరుణ్, రాధిక, అంజనీ దేవి, తదితర వాలంటీర్లు స్వచ్ఛంధంగా పాల్గొన్నారు.

## ఆల్ఫా ఓమేగా బ్లెస్సింగ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని





కాజీపేట రైల్వే స్టేడియం ఆవరణలో జరిగిన ఆల్ఫా ఒమేగా బ్లెస్సింగ్స్ ఫెస్టివల్‌కి బిషప్ జాన్ మార్కండేయ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన బ్రదర్ అనిల్ కుమార్ ను ఎమ్మెల్యే నాయిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ పాస్టర్‌గా 40 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసిన బిషప్ జాన్ మార్కండేయకు అభినందనలు తెలిపారు. కాజీపేట, త్రినగర ప్రాంతాల్లో నాలుగు దశాబ్దాలుగా బిషప్ అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు.సాయంకాల వేళ వేలాది మంది క్రైస్తవ సోదరులను కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్ కాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రూర్ పాషా హాజరవడం ఈ సందర్భంగా మన నగరంలో కులమతా లకు అతీతంగా సోదరభావం,ఐక్యత, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని ఎమ్మెల్యే నాయిని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ నిఖిల్ జాన్,డాక్టర్ దీవెన కుమారి,సంఘ సభ్యులు బొక్క రమేష్. ఐలేష్.ధర్ల రాజు,అభిషేక్. మనోజ్,అద్విక్,అక్షయ్. సందీప్,తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండలం లో అభివృద్ధి ప్రారంభోత్సవాలు, చేసిన భువనగిరి ఎమ్మెల్యే,



**తొలి అక్షరం:వలిగొండ, నవంబర్, 25.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామపంచాయతీ రోడ్డు, మత్స్యగిరి గుట్ట సిసి రోడ్డు ప్రారంభోత్సవం, చేయడం జరిగింది, తర్వాత బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వలిగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మత్స్యగిరి గుట్ట చైర్మన్ నరేష్ రెడ్డి,వలిగొండ మాజీ ఎంపీపీలు నూతి రమేష్ రాజ్, చిట్టేడి జనార్దన్ రెడ్డి, అరూరు సింగిల్ విండో చైర్మన్ వెంకట్రాంరెడ్డి,మాజీ సర్పంచులు, జి ను కల దానయ్య, పోలేపాక చెమ్మయ్య, మాజీ ఎంపిటీసీబై కాని ముత్యాలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, బండారు నర్సింహారెడ్డి, తుమ్మల శ్రీనివాస్, అరూరు గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, వలిగొండ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి, తుమ్మల మురళి, తుమ్మల సంతోష్ కుమార్, పసుల ఎన్నయ్య, సత్యనారాయణ, అరూరు గౌడ సంఘం అధ్యక్షుడు కళ్లెం బాల శంకర్, రజక సంఘం అధ్యక్షులు వెలిమినేటి సంతోష్ కుమార్, కోయగూర మధు, మీసాల మత్స్యగిరి, కొడితల లక్ష్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

# 33/11 కెవి నూతన ఉపకేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన







### భూమి పూజ చేసిన స్థానిక శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి

**పెద్దవంగర నవంబర్ 25 తొలి అక్షరం** మండల కేంద్రం లోని విద్యుత్ ఉపకేంద్రం భూమి పూజా కార్యక్రమం లో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ. ఈ ఉపకేంద్రం నిర్మాణం పూర్తయ్యే తరవాత పెద్దవంగర మండలంలోని గ్రామాలన్నింటికి నిరవధిక, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని, రైతులకు, చిన్న పరిశ్రమలకు, గృహాలకు పెద్ద ఎత్తున లాభం కలుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రాంతం ఎదుర్కొన్న వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు పూర్తిగా తగ్గిపోతాయని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాకుండా, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల కూడా ముఖ్యమని వారు అన్నారు..

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ. పెద్దవంగర మండల అభివృద్ధికి ఈ ఉపకేంద్రం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, ప్రజల పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వారికి మరింత ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, ఆధునీకరణ కార్యక్రమాలు రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తున్నాయని వారు పేర్కొన్నారు..ఈ కార్యక్రమం లో విద్యుత్ శాఖ అధికారులు ఎస్ ఈ విజేయందర్ రెడ్డి. డీ ఐ రవి. ఎ డి ఈ చలపతి రావు. ఎ ఈ రమేష్ బాబు. శ్రీధర్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్. నియోజకవర్గం నాయకులు హుమ్యానాయక్. మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ నెమరుగోమ్ములు ప్రవీణ్ రావు. జాతోట్ నెహ్రు నాయక్. రంగు మురళి. పొడిశెట్టి సైదులు. బీస్ హరికృష్ణ. సంకెపెల్లి రవీందర్ రెడ్డి.బండారి వెంకన్న. మాజీ ఎంపీటీసీ దంతలపెల్లి రవి. జాటోత్ వెంకన్న. మహిళా నాయకులు చిలుక దేవేంద్ర. బేడుదా ఉమా. కల్పన తదితరులు పాల్గొన్నారుస్థానిక ప్రజలు, రైతు సంఘాలు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల అభివృద్ధిలో ఇది మరో మంచి అధ్యాయమని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# లెజెండరీ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ అహ్మద్ ఖాన్‌కు ఘన సన్మానం





### అవార్డు గ్రహీతకు సయ్యద్ సుల్తాన్ ఫౌండేషన్, ఫెమినా మహిళా మండలి అభినందన

**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 25** ఇటీవల ప్రతిష్టాత్మకమైన నంది అవార్డుతో పాటు, లెజెండరీ మార్షల్ ఆర్ట్స్ లైఫ్ టైమ్ లెగసీ అవార్డును గెలుచుకున్న షాద్ నగర్‌కు చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన మార్షల్ ఆర్ట్స్‌కు చేసిన సేవలను గుర్తించి, సయ్యద్ సుల్తాన్ ఫౌండేషన్, ఫెమినా మహిళా మండలి సంయుక్తంగా ఘనంగా సన్మానించాయి. ఫరూక్ నగర్‌లోని అంజుమన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ సయ్యద్ అలియా సుల్తానా ఆధ్వర్యంలో మాస్టర్ అహ్మద్ ఖాన్‌ను శాలువా, పూలతో సత్కరించారు.

**మహిళలు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి: మాస్టర్ అహ్మద్ ఖాన్**

సమాజంలో మహిళలు, ఆడపిల్లలపై పెరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలు, మహిళలు తమను తాము రక్షించుకోవడానికి దృఢంగా ఉండాలి. ఆత్మరక్షణ కోసం ప్రతి మహిళా కరాటే లేదా కుంగ్ ఫు వంటి విద్యలను తప్పక నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విద్యల ద్వారానే స్వీయ రక్షణ సాధ్యమవుతుందని నొక్కి చెప్పారు. తనను సన్మానించిన సయ్యద్ సుల్తాన్ ఫౌండేషన్, ఫెమినా మహిళా మండలికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు ఉన్నారు.

# శోభన్ బాబు ఫౌండేషన్ నుంచి 60 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

### మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం
### విద్యాభివృద్ధికి శోభన్‌బాబు సేవా మనసు
### ముఖ్య అతిథిగా పాల్గొన్న గంటా సంజీవ్ రెడ్డి



ఇనుగుర్తి మండలం,గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిరోజూ కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పాఠశాలకు చేరడంలో పడుతున్న ఇబ్బందులను గుర్తించిన భుక్య శోభన్‌బాబు పల్లె పిల్లల చదువుకు వెలుగు పంచే సేవా కార్యక్రమం చేపట్టారు. ఇనుగుర్తి, కోమటపల్లి, చిన్న ముప్పారం ప్రభుత్వ హైస్కూల్‌లకు చెందిన మొత్తం 60 మంది అర్హులైన విద్యార్థులకు 60 సైకిళ్లను అయ్యగారిపల్లి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఎం ఈ ఓ రూప రాణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా ఇనుగుర్తి ఎం ఆర్ ఓ శ్రీనివాస్, ఎస్సై కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కూరెల్లీ సతీష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మమిడి అశోక్, మాజీ సర్పంచ్ మమిడి శోభన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాలోత్ మంజుల, మాలోత్ మంగ్యా నాయక్, మమిడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భుక్య శోభన్‌బాబు మాట్లాడుతూ, "పల్లెల్లో చదువుకునే పిల్లలు ప్రతిరోజూ దూరాలు నడవడం చూస్తుంటే మనసుకు బాధగా ఉంటుంది. వారి చదువుకు ప్రోత్సాహంగా ఈ చిన్న సహాయం చేయడం నా సామాజిక బాధ్యత. పుట్టిన ఊరికి సేవ చేయడం నా అదృష్టం. ఈ కార్యక్రమానికి ప్రేరణనిచ్చిన వై.వి. గోపాలకృష్ణ మూర్తి గారికి ప్రత్యేక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.ముఖ్య అతిథి గంటా సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ,"శోభన్‌బాబు సేవాభావం నిజంగా అభినందనీయం. పుట్టిన ఊరిపట్ల ప్రేమతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం గ్రామాభివృద్ధికి పెద్ద తోడ్పాటు. విద్యార్థుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తరపున సహాయం కొనసాగుతుంది" అన్నారు.మాజి సర్పంచ్ మమిడి శోభన్ మాట్లాడుతూ,"శోభన్‌బాబు మా గ్రామానికి గర్వకారణం. పిల్లల కోసం ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తారని విశ్వాసం ఉంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్హుల ఎంపిక పారదర్శకంగా జరగడం,

**ప్రతీ విద్యార్థి అవసరాన్ని పరిశీలించి సైకిళ్ల అందజేత,**

గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంది."ఈ సైకిళ్లు మా పిల్లల చదువులో గొప్ప మార్పు తీసుకువస్తాయి" అని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు

# అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితం అంకితం చేసిన మహానేత -గండు ఐలయ్య సేవలను స్మరించిన ఇనుగుర్తి ప్రజలు

### -గండు ఐలయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
### -రోగులకు పండ్ల పంపిణీ - సేవాభావానికి నిదర్శనం
### - అభివృద్ధికి పునాది వేసిన నాయకుడిగా ఐలయ్యను కొనియాడిన వక్తలు
### - అట్టడుగు వర్గాల పరిరక్షణలో మార్గదర్శి గండు ఐలయ్య
### - సొసైటీలు ఏర్పాటు చేసి గౌడ కులస్తులను ఏకం చేసిన సేవలను జ్ఞాపకం చేసుకున్న నేతలు



**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 25** ఇనుగుర్తి మండలంలో అట్టడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తన తపన, పోరాటాలతో చిరస్థాయిగా నిలిచిన గండుఐలయ్య వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చిన్న బస్టాండులో ఉన్న గండుఐలయ్య విగ్రహానికి పిఎసిఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, గుండా వెంకన్న మరియు ఇతర ప్రజానేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.తరువాత, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన నాయకులు ఆసుపత్రికి వచ్చిన రోగులకు పండ్ల పంపిణీ చేసి సేవాభావాన్ని ప్రతిబింబించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పిఎసిఎస్ చైర్మన్ దికొండ వెంకన్న గారు, "అట్టడుగు వర్గాల ఉద్యమ సారథి, సామాజిక న్యాయ సాధన కోసం నిరంతరం పోరాడిన మహానేత గండుఐలయ్య గారి సేవలు ఎన్నటికీ మరువలేనివి" అని పేర్కొన్నారు.

మండల కేంద్రమైన ఇనుగుర్తిలో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నేతలు విశదపరిచారు. ఆ రోజుల్లోనే జిల్లా పరిషత్ పాఠశాల, ఎస్సీ సంక్షేమ వసతి గృహం, గ్రామపంచాయతీ కార్యాలయం, గ్రంథాలయం వంటి ప్రజా ఉపయోగ భవనాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, దాదాపు 20 కి పైగా మంచినీటి బావులు తవ్వించడం, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించడం వంటి అమూల్య సేవలను గుర్తుచేశారు.గౌడ కులస్తులను ఏకం చేస్తూ సొసైటీలు ఏర్పాటు చేయడం, భూస్వాములకు వ్యతిరేకంగా బలహీన వర్గాల కోసం నిర్భయంగా పోరాడటం, పేదలకు%-%దళితులకు భూములు పంచిపెట్టడం వంటి ఆయన పోరాటాలను వక్తలు ప్రశంసలతో స్మరించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గుండా వెంకన్న, మాజీ సర్పంచ్ జాటోతా హరిచంద్ నాయక్, రిటైర్డ్ టీచర్ సట్ల మల్లయ్య, రాయిలి ఉప్పలయ్య, ఉమ్మగాని మల్లయ్య, గుజ్జునూరి వెంకన్న, కందునూరి వెంకన్న, బొల్లోజు చంద్రయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను విస్మరించిన కాంగ్రెస్ నిర్ణయంపై అధికార పార్టీ హరికృష్ణ ఓ బి సి అధ్యక్షుడి రాజీనామా! సిద్ధం

- 13 గ్రామాల్లో బీసీలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడం దారుణం
-పార్టీలోనే ఉంటా
కానీ అన్యాయాన్ని ఎప్పుడూ అంగీకరించను'హరికృష్ణ స్పష్టం
- ఇనుగుర్తి రాజకీయాల్లో అలజడి రేపిన కీలక నిర్ణయం



**తొలి అక్షరం నవంబర్ 25** చిన్ననాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓ బి సి మండల అధ్యక్షుడు మర్ద హరికృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మొత్తం 13 గ్రామాల్లో ఒక్క బీసీ అభ్యర్థికి కూడా సర్పంచ్ టికెట్ ఇవ్వకపోవడం బీసీ వర్గాల గౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.హరికృష్ణ మాట్లాడుతూ"బీసీలను పట్టించుకోని విధానం కొనసాగితే మేము మౌనంగా ఉండం. అన్యాయంపై గళమెత్తడం నాయకుడిగా నా బాధ్యత" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాలంటే గౌరవమున్నా, బీసీలను పూర్తిగా పక్కన పెట్టే నిర్ణయాలను తాను ఏ సందర్భంలోనూ అంగీకరించనని ధీటుగా ప్రకటించారు.పార్టీని విడువకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ, కానీ అన్యాయానికి నిరసనగా ఓ బి సి మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బీసీ వర్గాలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని హరికృష్ణ గట్టిగా హామీ ఇచ్చారు. ఆయన ఈ సంచలన నిర్ణయం ఇనుగుర్తి మండల రాజకీయాల్లో భారీ చర్చకు, బీసీ వర్గాల్లో తీవ్ర స్పందనకు కారణమవుతోంది.

## బీసీల హక్కులు ఎవరి చేతుల్లో పోయాయి?

## - యూత్ ప్రెసిడెంట్ ఉడుత అనిల్ ప్రశ్న

- 42% రిజర్వేషన్ మాటల్లోనే
ఇనుగుర్తిలో ఒక్క బీసీ సర్పంచ్ కూడా లేకపోవడం విచారం
- మహబూబాబాద్ జిల్లాలో కేవలం నాలుగు బీసీ టికెట్లు - ఇది న్యాయమా? అని ఉడుత అనిల్ ప్రశ్న
-రాబోయే ఎన్నికల్లో ప్రజలే తీర్పు చెబుతారు బీసీలను విస్మరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరిక



**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 25** ఇనుగుర్తి మండల కేంద్రంలోని చిన్ననాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఉడుత అనిల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. "42 శాతం రిజర్వేషన్ అమలు చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడినా%ా% నేలమీద బీసీలకు న్యాయం జరిగిన దాఖలాలు కనిపించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు.ఉడుత అనిల్ మాట్లాడుతూ, "మన ఇనుగుర్తి మండలంలోనే చూడండి%ా% ఒక బీసీకి కూడా సర్పంచ్ పదవి రాలేదు. ఇది ఎంత పెద్ద అన్యాయం? బీసీలకు న్యాయం చేయాలి అని చెప్పే కాంగ్రెస్ నాయకులు, వాస్తవానికి బీసీల హక్కులను అణగదొక్కే విధంగా వ్యవహరిస్తున్నారు" అని అన్నారు.అదేకాగా మహబూబాబాద్ జిల్లా మొత్తం పరిశీలించినా కేవలం నాలుగు బీసీ టికెట్లు మాత్రమే ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వభావానికి నిదర్శనమని ఆయన తేల్చిచెప్పారు. "బీసీల ఓటు వచ్చేసరికి వాళ్లే అన్నీ, కానీ టికెట్ల విషయంలో మాత్రం పూర్తిగా పక్కకు నెట్టేసే తంత్రం కాంగ్రెస్‌ది. ఇది ఆత్మపరిశీలన చేసుకోవలసిన విషయం" అని మండిపడ్డారు. ప్రజలు ఇప్పుడు చాలా స్పష్టంగా ఆలోచిస్తున్నారని, ఎవరు వారి హక్కులకు నిలుస్తారో, ఎవరు కేవలం మాటలు చెబుతారో బాగా తెలుసుకుంటున్నారని అన్నారు. "ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే నిజమైన తీర్పు చెప్పబోతున్నారు. బీసీలను విస్మరించిన వారికి ఓటు రూపంలో తగిన గుణపాఠం చెబుతారు" అని ఆయన ధీమాగా వ్యాఖ్యానించారు.

## వలిగొండ మండలం లో అభివృద్ధి ప్రారంభోత్సవాలు, చేసిన భువనగిరి ఎమ్మెల్యే,



**తొలి అక్షరం:వలిగొండ, నవంబర్, 25.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామపంచాయతీ రోడ్డు, మత్స్యగిరి గుట్ట సిసి రోడ్డు ప్రారంభోత్సవం, చేయడం జరిగింది, తర్వాత బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వలిగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మత్స్యగిరి గుట్ట చైర్మన్ నరేష్ రెడ్డి,వలిగొండ మాజీ ఎంపీపీలు నూతి రమేష్ రాజ్, చిట్టేడి జనార్దన్ రెడ్డి, అరూరు సింగిల్ విండో చైర్మన్ వెంకట్రాంరెడ్డి,మాజీ సర్పంచులు, జి ను కల దానయ్య, పోలేపాక చెమ్మయ్య, మాజీ ఎంపీటీసీబై కాని ముత్యాలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, బండారు నర్సింహారెడ్డి, తుమ్మల శ్రీనివాస్, అరూరు గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, వలిగొండ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి, తుమ్మల మురళి, తుమ్మల సంతోష్ కుమార్, పసుల ఎన్నయ్య, సత్యనారాయణ, అరూరు గౌడ సంఘం అధ్యక్షుడు కళ్లెం బాల శంకర్, రజక సంఘం అధ్యక్షులు వెలిమినేటి సంతోష్ కుమార్, కోయగూర మధు, మీసాల మత్స్యగిరి, కొడితల లక్ష్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పరిపాలనతోనే ఆదర్శ రాష్ట్రం సాధ్యం









## దేశం గర్వించదగ్గ మహిళా నేత ఇందిరా గాంధీ.మహిళల సాధికారతకు పెద్దపీట షాద్‌నగర్ నియోజకవర్గం మహిళా సమైక్య సంఘాలకు రూ.3,48,68,500 నిధుల విడుదల వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 25**షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 'మహిళ ఉన్నతి %–% తెలంగాణ ప్రగతి' వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని రుణాలను అందజేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన వడ్డీ లేని రుణాల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరించిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలి కాలంలోనే రూ.304 కోట్లు విడుదల చేసి మహిళా సంఘాల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా సమైక్య సంఘాలకు మొత్తం రూ.3,48,68,500 నిధులు జమయ్యాయని తెలిపారు. ఈ నిధులతో మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా బలపడే అవకాశం ఉందన్నారు. రుణాలపై వడ్డీ మొత్తాన్ని కూడా ప్రభుత్వం నియమితంగా భరిస్తోందని వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ...దేశ చరిత్రలో అజరామరమైన నేత ఇందిరా గాంధీ సేవలను స్మరించారు. పురుషాధిక్యత రాజకీయాల్లో మహిళలకు మార్గదర్శకంగా నిలిచిన ఇందిరా గాంధీ, దృఢనిశ్చయం, సేవా భావం, నాయకత్వగుణాలతో దేశ నిర్మాణానికి అపూర్వమైన సేవలందించారని కొనియాడారు.మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రగతికి పునాది అని పేర్కొంటూ, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాల విస్తరణ, సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, చీరలు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందని చెప్పారు. ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని శంకర్ వెల్లడించారు.వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మహిళలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. రుణాలు అందిన సందర్భంగా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ వి. సునీత, మండలాల ఎంపీడీవోలు, ఆర్డీవో సరిత, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పులు మేధావులతోనే సాధ్యం

## రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ జనసేన అధ్యక్షుడిగా కత్తి చంద్రశేఖరప్ప





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 25**ప్రపంచంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పులు మేధావులతోనే సాధ్యమైందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన కత్తి చంద్రశేఖర అప్ప, స్రవంతి లను మంగళవారం ఆర్ కృష్ణయ్య, అరుణ్ కుమార్ లు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఇటీవలే జాతీయ బీసీ జనసేన నూతన సంఘాన్ని ప్రకటించిన అనంతరం మంగళవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో సంఘం సర్టిఫికెట్ను ఆర్ కృష్ణయ్య అరుణ్ కుమార్ చేతిలో మీదుగా కత్తి చంద్రశేఖర అప్ప, స్రవంతి లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ ఉద్యమం అత్యంత బలంగా ఉందని, రానున్న కాలం బీసీ రాజ్యమేనని వెల్లడించారు. బీసీ మేధావులు బలమైన ఉద్యమం చేపడితే పాలకులు దిగివచ్చి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. బీసీలకు భిక్షం వద్దు, రాజ్యంగబద్దంగా రావాల్సిన హక్కులను కల్పించాలన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం అత్యంత బలంగా
(ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించి, ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద కులాలకు గౌరవం అధికారం ద్వారానే సాధ్యమౌతుందని పేర్కొన్నారు.

జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప మాట్లాడుతూ.. జాతీయ బీసీ జనసేన ఏర్పాటుకు పూర్తిగా సహకరించిన జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అరుణ్ కుమార్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలలో మంచి స్ఫూర్తిని రగిలించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడతానని ఆర్ కృష్ణయ్య ఈ సందర్భంగా తెలిపారు. బీసీ జనసేన మరో మహిళా నాయకురాలు స్రవంతి మాట్లాడుతూ.. అనుకున్న విధంగా బీసీ జనసేన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడం ఆ సర్టిఫికెట్ను ఆర్ కృష్ణయ్య అరుణ్ కుమార్ చేతిలో మీదుగా అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఇదో గొప్ప విజయం అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం కూడా సంతోషం నింపిందని అన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ బిసి సేన నాయకులు బోయ చెన్నయ్య స్రవంతిరాజ్ తదితరులు ఉన్నారు.

# "మీ ఓటు నోటుకు అమ్ముకుంటే... రేపు ఆ నాయకుడి కాళ్లకే దాసోహమవ్వాలి!"

## యువ నాయకుడు తాడూరి సంపత్

ఓటు పవిత్రంబీ ప్రలోభం లేది బానిస సంకెళ్లు
క్షణికావేశపు నోటు - తరతరాల గ్రామ నష్టమే
అభివృద్ధికి పునాది - స్వచ్ఛమైన, ధైర్యవంతమైన ఓటు
నోట్ల రాజకీయాలకు చెక్ పెట్టండి: యువకుడు సంపత్ నుండి గ్రామీణ ప్రజలకు సందేశం



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 25:**గ్రామీణ రాజకీయాల్లో డబ్బుల ప్రవాహం పెరిగిపోతున్న తరుణంలో, నెల్లికుదురు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన యువకుడు తాడూరి సంపత్ ప్రజలకు కనువిప్పు కలిగించే విధంగా అత్యంత ఘాటైన హెచ్చరికను జారీ చేశారు. మంగళవారం రిపోర్టర్లతో మాట్లాడుతూ, నోట్ల రాజకీయాల పట్ల ఆయన తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు.సర్పంచ్ ఎన్నికల సందర్భంలో ప్రజలు డబ్బుకు ఆశపడి ఓటు వేయడం వలన కలిగే భయంకరమైన పర్యవసానాలను సంపత్ ఈ సందర్భంగా ఎత్తి చూపారు.సంపత్ గొంతుక:"మిత్రమా, ఈ ఒక్క విషయం గుర్తుపెట్టుకో... సర్పంచ్ అంటే వాడు మనకు సేవకుడు! కానీ, ఈ రోజు నువ్వు కేవలం ఆ కరెన్సీ నోటుకి అమ్ముడుపోయి ఓటు వేస్తే... రేపటి రోజు నువ్వు నీ అవసరాల కోసం, సమస్యల పరిష్కారం కోసం అదే వ్యక్తి కాళ్లు పట్టుకోవాల్సి వస్తది. నీకు స్వాతంత్ర్యాన్నిచ్చే ఓటును కేవలం ఒక కాగితపు నోటుకి అమ్ముకుని నీ భవిష్యత్తును బానిసత్వానికి తాకట్టు పెట్టొద్దు" అని సంపత్ అత్యంత గట్టిగా, భావోద్వేగంగా చెప్పారు.

ఓటు హక్కు అనేది గ్రామానికి నాయకుడిని ఎన్నుకునే ఒక పవిత్రమైన హక్కు అని, ఇది గ్రామ అభివృద్ధికి ప్రజలు తీసుకునే అత్యంత ముఖ్యమైన నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు.

యువత ఈ 'నోట్ల రాజకీయం' అనే విషవలయం నుంచి బయటపడాలని, గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యకరమైన రాజకీయాలకు పునాది వేయాలని సంపత్ పిలుపునిచ్చారు.

## నెల్లికుదురు అభివృద్ధి - ఎంపీ నుంచి నాలుగు ఐమాక్స్ లైట్లు మంజూరు

-మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు గ్రామస్తుల ప్రత్యేక కృతజ్ఞతలు
- ప్రజావాద నాయకత్వానికి నిదర్శనం గా అభివృద్ధి పనులు
- గ్రామ నాయకులు, యువత, పార్టీ ప్రతినిధులు పాల్గొని మద్దతు వ్యక్తం
- ప్రజల అవసరాలు ప్రాధాన్యంగా చూస్తున్న ఎంపీపై ప్రజల ప్రశంసల వర్షం



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 25**నెల్లికుదురు గ్రామ అభివృద్ధిలో మరో అధ్యాయం ప్రారంభమైంది. గ్రామానికి 4 ఐమాక్స్ లైట్లు మంజూరు చేసిన మనసున్న మహారాజు, పేదల పెన్నిధి, అభివృద్ధి ప్రదాత, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ గారికి గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఎంపీ గారి సేవాభావాన్ని, గ్రామాల అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతను ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "గ్రామ ప్రజల అవసరాలు తెలుసుకొని వెంటనే స్పందించే నాయకుడు బలరాం నాయక్ గారు. నెల్లికుదురు అభివృద్ధికి ఇంత పెద్ద మద్దతు ఇవ్వడం ప్రజల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనం" అని అన్నారు.కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రత్నపురి యాకయ్య, గుగులోత్ వంశీ నాయక్, పెరుమండ్ల జగన్ బాబు, నెల్లికుదురు మండలం యూత్ అధ్యక్షుడు మద్ది రాజేష్, ఓబీసీ మండల అధ్యక్షుడు ఆకుల నరసయ్య తదితరులు పాల్గొని ఎంపీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ ప్రజలు ఈ ఐమాక్స్ లైట్లతో రహదారి భద్రత, రాత్రి సమయంలో గ్రామ జీవన విధానం మరింత మెరుగుపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు..

## కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి




**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 25**కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేశంపేట మాజీ జెడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొని, గ్రామ మహిళలకు చేతుల మీదుగా చీరలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచి మహిళల సంక్షేమం కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు,ఇందిరమ్మ చీరలు వంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళల జీవితాల్లో కొత్త ఆశాకిరణంగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అన్నింటినీ నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు.అనంతరం అందరూ సంతోషంగా చీరలు స్వీకరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్, వార్డు మెంబెర్లు, గ్రామ పెద్దలు, స్థానిక మహిళా సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో సంబరంగా మారి, మహిళల్లో ఆనందాన్ని నింపింది.

## ఘనంగా కందిమల్ల గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 25:**రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన కందిమల్ల యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు కందిమల్ల గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగినవి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహగ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి పెరమండ్ల .నవీన్. మాజీ ఉపసర్పంచ్ చల్ల అనిత.సత్య ప్రకాష్ మాజీ వార్డ్ మెంబర్లు చల్ల మల్ల. గోవర్ధన్ నోముల ధనమ్మ యాదగిరి నోముల ప్రవీణ్ గ్రామ పెద్దలు ఆవుల పర్వతాలు పబ్బు ఉషన్ సురవి. వెంకటయ్య యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కదారి నాగరాజు చిప్పలపల్లి సురేష్ ముత్యాల శివ నోముల స్వామి చిప్పలపల్లి రామచంద్రం గ్రామ యువకులు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# జెపి దర్గాలో శాంతి సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు

జేపీ దర్గాలో నెలకొన్న సమస్యలపై పలు సలహాలు సూచనలు చేసిన శాంతి కమిటీ సభ్యులు
వందల ఏళ్ల చరిత్ర ఉన్న పవిత్ర స్థలం ఎందుకు అభివృద్ధికి నోచుకోవడం లేదు
కోట్ల రూపాయల ఆదాయం ఉన్న దర్గాకు పైసా ఖర్చు పెట్టడం లేదు
దర్గాలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది
జేపీ దర్గాలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలి- గ్రామస్తుల వినతి
టిప్పర్లు ఓవర్ లోడ్ వేసుకొని అతివేగంగా నడుపుతున్నారు
వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి
దర్గాలో గంజాయి నియంత్రణపై పోలీసులు దృష్టి సారించాలి - గ్రామస్తులు
దర్గా అభివృద్ధితోపాటు సమస్యల పరిష్కారానికి స్థానికుల సహకారం ఎంతో అవసరం- సీఐ నరసయ్య







**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 25** జేపీ దర్గా సమస్యలపై సానుకూలంగా స్పందించిన శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్
పేట్ దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కొత్తూరు పోలీసుల ఆధ్వర్యంలో శాంతి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అయితే వందల ఏండ్ల చరిత్ర ...మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జహంగీర్ పీర్ దర్గాను . తెలంగాణ ప్రజలే కాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా పెద్ద ఎత్తున వేలకొద్ది భక్తులు దర్గాకు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన దర్గాగా.. మత సామరస్యానికి చిహ్నంగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇన్ముల‌నర్వ గ్రామం పరిధిలో ఉన్న జేపీ దర్గాను చెప్పుకుంటారు. రాష్ట్ర రాజదానికి అతి సమీపంలో ఉన్న ఈ దర్గా ముస్లింల పవిత్రస్థలమైనప్పటికీ హిందువులే అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. అందుకేమో ఈ దర్గాను మతసామరస్యానికి ప్రతీకగా భావిస్తారు. జనవరి వచ్చిందంటే చాలు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలే కాకుండా రాష్ట వ్యాప్తంగా ఉన్న ముస్లింలు హజ్రత్ జహంగీర్‌పీర్ (జేపీ) దర్గాలో ఉర్సు ఎప్పుడా అని ఎదురుచూస్తుంటారు. ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రతి సంవత్సరం గ్రామస్తులు మత పెద్దలతో శాంతి సమావేశం ఏర్పాటు చేయడం ఆనవాయితీ ఈ శాంతి సమావేశంలో పలువురు గ్రామస్తులు స్థానిక నేతలు పాల్గొని సలహాలు సూచనలు చేశారు. ముఖ్యంగా దర్గాలో నెలకొన్న పలు సమస్యలపై కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న దర్గా మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దర్గాలో డ్రైనేజీ వ్యవస్థ గోరంగా ఉందని భారీ వర్షం పడినప్పుడు దర్గా మొత్తం జలమయమై భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే దర్గా ను దర్శించడానికి వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని మహిళలు చిన్నారులు స్నానాలు చేసి బట్టలు మార్చుకోవడానికి కూడా కనీసం స్నానాల గదులు లేకపోవడం శోచనీయమని అన్నారు. మంచినీటి వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందని అన్నారు దర్గాలో రోడ్లు సరిగా లేకపోవడం వల్ల భారీ వాహనాలు దర్గా ముందు నుంచే వెళ్తాయని ముఖ్యంగా టిప్పర్లు ఓవర్ లోడ్ తో అతివేగంగా వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు సంభవించి ద్విచక్ర వాహనదారులు చనిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల భారీ వాహనాలు అతివేగంగా నడుపుతున్నారని ఈ ప్రమాదాలను నియంత్రించాలంటే అలాగే దర్గాలో శాంతి భద్రతలపై దృష్టి సాధించాలంటే ఇక్కడ పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని అన్నారు. దర్గాలో విచ్చలవిడిగా మందు అమ్మకాలు జరుగుతున్నాయని అలాగే గంజాయి నియంత్రణ పై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆగీరు రవికుమార్, లంబాడి హక్కుల పోరాట సమితి రాజేష్ నాయక్,బిఆర్ఎస్ నాయకులు రవికుమార్ ముదిరాజ్, రవి నాయక్, మహమ్మద్ జిలాని మరియు స్థానిక నేతలతో పాటు గ్రామస్తులు పలువురు మత పెద్దలు పాల్గొన్నారుజెపి దర్గా శాంతి మావేశంలో శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్ మాట్లాడుతూ దర్గా లో ఉన్న సమస్యల పరిష్కారానికి స్థానికులు మరియు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్ అన్నారు సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేయాలని సమస్యను ముందుగా గుర్తిస్తే దానికి పోలీసులు ఎలాంటి పరిష్కారం చూయించాలి అనేది ఆలోచిస్తాం ఎందుకంటే సమస్య మీ దగ్గరే ఉంది పరిష్కారం కూడా మీ దగ్గరే ఉంది అని అన్నారు. అవసరం ఉంటేనే డయల్ 100 కు ఫోన్ చేయాలి కొంతమంది ఆకతాయిలు అవసరం ఉన్నా లేకపోయినా ఫోన్ చేస్తున్నారు. దానివల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి న్యాయం జరగడంలేదని అన్నారు. శాంతి సమావేశంలో లేవనెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు.

## ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి నాణ్యమైన విద్య నాణ్యమైన వైద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తా గర్దాసు విక్రమ్‌టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రపాలనగరం




**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 26:**ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి గ్రామంలో నాణ్యమైన విద్య నాణ్యమైన వైద్యం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని గ్రామంలో అందరినీ కలుపుకొని గ్రామ అభివృద్ధి కోసం అందరి ఐక్యమత్యంతో ముందుకు సాగుతానని ఒక యువ నాయకునికి అవకాశం కల్పించాలని గ్రామంలో డిగ్రీ ఆ పై స్థాయి చదివిన అన్న తమ్ములకు అక్క చెల్లెళ్లకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తానని గ్రామంలో పెద్దలను అక్క చెల్లెలను అన్నాతమ్ములను ఆత్మీయ బంధువులను అందరిని కలుపుకొని వారి సలహాలు సూచనలు తీసుకొని ఐక్యమత్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి మండలంలో ఆదర్శ గ్రామపంచాయతీగా చూపిస్తానని
ఒక యువ నాయకునిగా మీ ముందుకు ఇంద్రపాలనగర ప్రజలే నా దేవుళ్ళుగా భావిస్తూ ఒక్కసారి ఇంద్రపాలనగరం సర్పంచ్ గా అవకాశం కల్పించాలని కోరుతూ

మీ గర్దాస్ విక్రమ్ టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రపాలనగరం

## దేశంలోనే అతిపెద్ద నగరంగా హైదరాబాద్.. మారనున్న భాగ్యనగరం స్వరూపం

హైదరాబాద్ మహానగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించనుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు విస్తరించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విలీన ప్రక్రియలో భాగంగా హైదరాబాద్ శివార్లలోని 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో కలపనున్నారు.

తెలంగాణ మున్సిపాలిటీ చట్టాల సవరణకు మంత్రివర్గం ఆమోదం

ఈ విలీనం కోసం జీహెచ్ఎంసీ, తెలంగాణ మున్సిపాలిటీ చట్టాలను సవరించడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. ఈ నిర్ణయంతో జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుత 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2,735 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. జనాభా కూడా సుమారు 2 కోట్లకు చేరనుంది. నగరంలో సమగ్రాభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది.మరోవైపు ఈ విలీన ప్రతిపాదనపై అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వడానికి జీహెచ్ఎంసీ కౌన్సిల్ కూడా అంగీకరించింది. అయితే, కౌన్సిల్‌లో ఎంఐఎం పార్టీ ఈ ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగియనుండగా, ఆ తర్వాతే విలీన ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశం ఉంది.

ఈ విస్తరణ వల్ల శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయి. ఉద్యోగుల వేతనాలు జీహెచ్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా మారతాయి. పన్నుల విధానంలో కూడా ఏకరూపత వస్తుంది. అయితే, ఈ నిర్ణయంతో హెచ్ఎండీఏ ఆదాయానికి భారీగా గండిపడే అవకాశం ఉంది. ఓఆర్ఆర్ వెంబడి ఉన్న గ్రోత్ కారిడార్ నుంచి వచ్చే ప్రధాన ఆదాయం ఇకపై జీహెచ్ఎంసీకి వెళ్లనుంది.

## మోత్కూల గూడ గ్రామం లో ఇంటింటికీ ఇందిరమ్మ చీరల పంపిణి



**తొలి అక్షరం/నందిగామ,నవంబర్ 25**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇంటింటికి ఇందిరమ్మ చీరలను అందించడం జరుగుతుందని ఇందిరమ్మ చీరల పంపిణిలో భాగంగా నందిగామ మండలంలోని మోత్కుల గూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘం ద్వారా మహిళలకు చీరలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచి మహిళల సంక్షేమం కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు,ఇందిరమ్మ చీరలు వంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళల జీవితాల్లో కొత్త ఆశాకిరణంగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అన్నింటినీ నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు.గ్రామంలో సంబరంగా మారి, మహిళల్లో ఆనందాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక మహిళా సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామన్నపేట టిఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 26:**పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని టిఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ పత్రికా ప్రకటనలో తెలిపినారు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆశీస్సులతో కెసిఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో అందరినీ కలుపుకొని ఐక్యమత్యంగా గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తానని గత 30 సంవత్సరాల నుంచి గ్రామాన్ని మాత్రమే నమ్ముకుని గ్రామ ప్రజలే దేవుళ్ళు అనుకొని ఏ లాంటి వ్యాపారాలు లేకున్నా ఆర్థిక వనరులు లేకున్నా పార్టీ ని నమ్ముకుని పల్లివాడ గ్రామ ప్రజలే నా ఆత్మీయ బంధువులు అనుకొని ముందుకు సాగుతున్న ఒక్కసారి పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలనుగ్రామ పెద్దలనునా అక్క చెల్లెలను అన్నదమ్ములను ఆత్మీయ బంధువులను మనస్ఫూర్తిగా కోరుకుంటూ పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి మీ ఆత్మీయ సోదరుడు కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ తెలిపినారు

# విద్యుత్ సరఫరా మెరుగు కోసం కీలక అడుగు

**-బోడుప్పల్ సబ్-స్టేషన్ పరిధిలో నూతన 11కేవీ ఫీడర్ ప్రారంభం**

**-ఎస్ఈ ప్రతిమ సోమ్**





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),నవంబర్26:** బోడుప్పల్ సబ్–స్టేషన్ పరిధిలో నూతన 11కేవీ ఫీడర్ ప్రారంభం విద్యుత్ సరఫరా మెరుగు కోసం కీలక అడుగు అని ఎస్ఈ ప్రతిమ సోమ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో, బోడుప్పల్ సబ్–స్టేషన్ పరిధిలో నూతన 11కేవీ సత్తిరెడ్డి కాలనీ ఫీడర్ను అధికారికంగా ప్రారంభించారు. ఇదివరకటి 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ నుండి ఈ కొత్త ఫీడర్‌ను వేరు చేయడం (బిఫర్కేషన్) ద్వారా ఈ ముఖ్యమైన ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు.

**ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభం:**

ఈ కొత్త ఫీడర్ ప్రారంభోత్సవంలో ఎస్ఈ ప్రతిమ సోమ్,,డిఈ సుబ్బారావు,ఏడిఈ రవీందర్, ఏఈలు వేణుగోపాల్, వినయ్ కుమార్ రెడ్డి వంటి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.వారి పర్యవేక్షణలో ఈ ఫీడర్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి. కొత్త ఫీడర్‌ను ఛార్జ్ చేయడం ద్వారా సత్తిరెడ్డి కాలనీ మరియు చుట్టుపక్కల ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను విజయవంతంగా మళ్లించారు.

**ప్రజలకు లభించే ప్రయోజనాలు:**

ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ...బృందావన్ కాలనీ ఫీడర్‌పై లోడ్ (భారం) చాలా ఎక్కువగా ఉండేదిఅని అన్నారు.కొత్త ఫీడర్ వేయడం వల్ల లోడ్ రెండుగా విభజించబడింది అని అన్నారు.దీని ఫలితంగా వోల్టేజ్ హెచ్చుతగ్గులు తగ్గి, స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతుంది అని తెలిపారు. అంతరాయాలు తగ్గుతాయి: ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినప్పుడు, ఆ సమస్య ఇప్పుడు ఒక ఫీడర్‌కే పరిమితం అవుతుంది.దీంతో ఆ ప్రాంతంలో మాత్రమే విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. పాత పద్ధతిలో ఎక్కువ కాలనీలకు ఒకేసారి కరెంట్ పోయేది అని అన్నారు.నిర్వహణ సులువు: కొత్త ఫీడర్ వల్ల మరమ్మతులు, పర్యవేక్షణ తేలిక అవుతుంది. త్వరితగతిన సమస్యలను గుర్తించి, పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. స్థిరమైన,మెరుగైన విద్యుత్ సేవలను అందించడానికి తమ శాఖ కట్టుబడి ఉందని ఎస్ఈ అన్నారు.కొత్త ఫీడర్ ఈ దిశగా ఒక గొప్ప ముందడుగు అని తెలిపారు.ఈ అభివృద్ధి పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# మరిపెడ పోలీస్ స్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్




**మరిపెడ తొలి అక్షరం నవంబర్ 25**

మహబూబాబాద్ జిల్లా %య్రా% డాక్టర్ శబరీష్. మరిపెడ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పలు వివరాలు అడిగి తెలుసోకొని, రికార్డు లను పరిశీలించి, పెండింగ్లో ఉన్న కేసులు మరియు క్రైమ్స్ గురించి తెలుసుకున్నారు. అలాగే రాబోయే గ్రామ పంచాయతీ ఎలక్షన్స్ లో ఎటువంటి అవంచనియా సంఘటన లు జరగకుండా శాంతియుత వాతావరణం లో ఎలక్షన్ జరిగే విధంగా మన పోలీస్ శాఖ పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మరిపెడ సిఐ రాజకుమార్ గౌడ్ ఎస్ ఐ లు వీరభద్ర రావు కోటేశ్వరరావు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# రక్తహీనతతో అనారోగ్య సమస్యలు - రోజు వారీ ఆహారంలోనే పరిష్కార మార్గాలు







మన శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో ఏ చిన్న సమస్య వచ్చినా కూడా అది పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. శరీరంలో తగినంత రక్తం లేకపోతే దానిని ఎనీమియా అంటారు. మన దేశంలో ఎనీమియా తరచూ చూస్తుంటాం. దీనికి వయసు, జాతి, లింగభేదం అంటూ ఎలాంటి తేడా లేదు. కాకపోతే ఐదేళ్లలోపు పిల్లల్లో, ముఖ్యంగా రెండేళ్లలోపు శిశువుల్లో, రజస్వల ఆరంభమైన అమ్మాయిల్లో, మహిళల్లో, వృద్ధుల్లో ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. కొందరిని పెద్దగా ఇబ్బంది పెట్టకపోవచ్చు గానీ కొందరికి తీవ్రంగా పరిణమించొచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలో రక్తహీనతకు కారణాలు, లక్షణాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

%ఏంటీ సమస్య? : రక్తంలో ఎర్ర రక్తకణాలు ఉండాల్సిన దాని కన్నా తక్కువగా ఉండటం వల్ల ఎనీమియా తలెత్తుతుందంటున్నారు నిపుణులు. మన శరీరంలో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ వాయువుల మార్పిడిలో హిమోగ్లోబిన్ అనే ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఇది ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ను సంగ్రహించి, రక్తం ద్వారా అవయవాలకు చేరవేస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతూ, వివిధ భాగాలకు ఎర్ర రక్తకణాలు మోసుకెళ్లుతాయని పేర్కొంటున్నారు. వీటి సంఖ్య తగ్గితే శరీరానికి ఆక్సిజన్‌తో కూడిన రక్తం తగినంత అందదని వివరిస్తున్నారు. ఇది అలసట, బలహీనతకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

ప్రభావం ఎక్కువే : ఐరన్ లోపంతో తలెత్తే ఎనీమియా మూలంగా పిల్లల్లో విషయగ్రహణ, తెలివి తేటలు, ఎదుగుదల కుంటుపడతాయంటున్నారు నిపుణులు. పెద్దవారిలో పని సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. శైశవంలో, బాల్యంలో ఎనీమియా ప్రభావాలు చాలా అధికంగా ఉంటాయంటున్నారు. గర్భిణుల్లోనైతే గర్భం నిలవకపోవటం, ముందే కాన్పవ్వటం, తక్కువ బరువు బిడ్డలు పుట్టటం వంటి సమస్యలూ ఎదురవుతాయని పేర్కొంటున్నారు.

మరణించినా జీవించవచ్చు! - అవయవదానం చేయాలంటే పేర్లు ఎలా నమోదు చేసుకోవాలో తెలుసా?

సంకేతాలు–లక్షణాలు : సాధారణంగా ఎనీమియా లక్షణాలు క్రమంగా ముదురుతూ వస్తుంటాయి. సమస్య తీవ్రతను బట్టి ఇవి రకరకాలుగా బయటపడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు.

స్వల్ప రక్తహీనతలో : నీరసం, నిస్సత్తువ, చర్మం పాలిపోవటం, నాలుక తెల్లగా అవటం, కనురెప్ప లోపలి భాగం తెల్లగా అవటం, నోట్లో పుండ్లు, నాలుక మంట, పెదాల చివర్లు పగలటం, పెదాలు ఉబ్బటం, జుట్టు రాలటం, వెంట్రుకలు కళ తప్పటం, ఏకాగ్రత లోపించటం, చిరాకు, కోపం లాంటి లక్షణాలు కనిపిస్తాయని %ఝిఎశీఎశ్రీఱఅఱఎ% అధ్యయనం పేర్కొంది.

మధ్యస్థ రక్తహీనతలో : ఎక్కువగా దాహం వేయటం, చెమటలు పట్టటం, బలహీనత, తల తేలిపోవటం, నాడి వేగంగా కొట్టుకోవటం, శ్వాస వేగంగా తీసుకోవటం.

తీవ్ర రక్తహీనతలో : వ్యాయామం చేస్తున్నప్పుడు పిక్కలు పట్టేయటం, ఆయాసం, మెదడు దెబ్బతినటం, గుండె లయ తప్పటం, గుండె కొట్టుకునేటప్పుడు గొణిగినట్టు చప్పుడు వినిపించటం, గుండె పెద్దగా అవ్వటం, గుండె వైఫల్యం, విచారం, శక్తి సన్నగిల్లటం, తరచూ మూడ్ మారటం.

రక్తకణాల ఉత్పత్తి తగ్గటం: బడికి వెళ్లే వయసు పిల్లలు, మహిళలు, వృద్ధుల్లో తలెత్తే ఎనీమియాకు ప్రధాన కారణం ఇదే. ఆరోగ్యకరమైన రక్తం ఉత్పత్తి కావటానికి హార్మోన్లు, ముఖ్యంగా ఎర్ర కణాల ఉత్పత్తిని పెంచే ఎరిత్రోపాయిటిన్ సమతులంగా ఉండాలని చెబుతున్నారు. అలాగే ఐరన్, విటమిన్ బి12, ఫోలేట్, విటమిన్ సి, కొన్ని ఖనిజాలు, ప్రొటీన్ కూడా అవసరమంటున్నారు. ఇవి తినే ఆహారం నుంచే లభిస్తాయని, అందువల్ల ఇలాంటి పోషకాలతో కూడిన సమతులాహారం తినటం ముఖ్యమని పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా 6%–%59 నెలల వయస్సు గల పిల్లలలో 40%, గర్భిణీలలో 37%, 15%–%49 సంవత్సరాల వయస్సు గల మహిళలలో 30% మంది రక్తహీనతతో బాధపడుతున్నారని %ఔనూ% అధ్యయనం పేర్కొంది.

రక్తకణాల విచ్ఛిన్నం : ఎర్ర రక్తకణాలు సగటున 120 రోజుల వరకు జీవిస్తాయని, ఆ తర్వాత చనిపోతాయని నిపుణులు చెబుతున్నారు. కానీ, కొన్నిసార్లు శరీరం వీటిని పరిపక్వం కాకముందే, జీవనకాలానికి ముందే నిర్మూలించొచ్చని అంటున్నారు. ఇందుకు ల్యూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులు, హెపటైటిస్, మలేరియా వంటి ఇన్‌ఫెక్షన్లు, ప్లీహం పెద్దగా అవ్వటం, కొన్నిరకాల మందుల వంటివి కారణం కావొచ్చని తెలియజేస్తున్నారు. కొందరికి సికిల్‌సెల్, థలసీమియా వంటి జబ్బులతోనూ ఎర్ర కణాలు త్వరగా క్షీణించొచ్చని వెల్లడిస్తున్నారు.

అతిగా రక్తస్రావం: గాయాలు, శస్త్రచికిత్సలు, తరచూ ముక్కు నుంచి రక్తం రావటం, అల్సర్లు, పెద్దపేగులో పిలకలు, రుతుస్రావం ఎక్కువగా అవటం, కాన్పు, కొన్ని రకాల క్యాన్సర్లలో రక్తస్రావం అవుతుంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎర్ర కణాల సంఖ్యా తగ్గుతుందని, ఫలితంగా ఐరన్ మోతాదులూ పడిపోతాయని అంటున్నారు. తగినంత ఐరన్ లేకపోతే ఎర్ర కణాల ఉత్పత్తి తగ్గుతుందని, చివరికి రక్తహీనతకు దారితీస్తుందని వివరిస్తున్నారు.

నులి పురుగులు ి ల్లల్లోనే కాదు, పెద్దవారిలోనూ పేగుల్లో నులి పురుగులు ఉంటాయని, ఇవి రక్తాన్ని పీల్చుకొని జీవిస్తాయంటున్నారు నిపుణులు. ఫలితంగా రక్తం తగ్గిపోయి, ఎనీమియాకు దారితీస్తుందని తెలియజేస్తున్నారు.

గాలిలో కలిసే పురుగు మందులు, రసాయనాల వంటి విషతుల్యాలు కొన్నిసార్లు ఎనీమియాకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. కొన్ని పదార్థాలు, చలి వాతావరణాలు కూడా ఎనీమియాకు

%నిర్ధారణ ఎలా? : ఎనీమియా అనుమానిత లక్షణాలు ఉన్నప్పుడు డాక్టర్లు సంపూర్ణ రక్తపరీక్ష చేసి, సమస్యను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ మోతాదులు పురుషులలో 12 గ్రాములు, మహిళలలో 11 గ్రాముల కన్నా తగ్గితే ఎనీమియాగా నిర్ధారిస్తారు. ఎనీమియా ఏ రకానికి చెందింది, ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవటానికి ఇతరత్రా పరీక్షలు కూడా అవసరమవుతాయి.

# నా విషయంలో అనుకున్నదాని కంటే ఎక్కువే జరిగింది



ఎవరి జీవితం ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటుందో చెప్పలేం. లైఫ్ లో ఏదీ ప్లాన్ చేసి రాదు అని అంటోంది మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. జీవితం ఊహించని మలుపులు తీసుకుంటుందని, అది మనల్ని ఎవరూ ఊహించని ప్రదేశాలకు తీసుకెళుతుందని చెప్పింది. తన కెరీర్ విషయంలో తన ఇమాజినేషన్ కు మించి జరిగిందని ఆమె కొత్త సినిమా బైసన్ ప్రమోషన్స్ లో భాగంగా ఓ సందర్భంలో తెలిపింది. అవును, కరక్టే ఆమె విషయంలో అదే జరిగింది. ఒక్కటైనా మంచి సినిమాలో నటించాలని కెరీర్ ప్రారంభించిన ఆమెకు, గడిచిన 10ఏళ్లలో అనేక మంచి క్యారెక్టర్లు పడ్డాయి. ఈ ఒక్క ఏడాదిలోనే అనుపమ కీలక పాత్ర పోషించిన డ్రాగన్, జానకీ వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, పరదా, కిష్కిందపురి సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. ఈ నాలుగు సినిమాలు నాలుగు విభిన్న కథలు. నాలుగింట్లో అనుపమ నాలుగు వైవిధ్యమైన రోల్స్ చేసింది. ప్రభాస్ బర్త్ డే.. అంత రిస్క్ అయితే చేయరు కదా? ఇక ఈ ఏడాది ఆమె ఐదో సినిమా కూడా రానుంది. ఆమె హీరోయిన్ గా- చియన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ హీరోగా నటించిన బైసన్ రేపు థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలో సినిమా గురించి పలు విషయాలు అనుపమ షేర్ చేసుకుంది. ఈ నేపథ్యంలోనే విధి గురించి అనుపమ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ సినిమా డైరెక్టర్ మారి సెల్వరాజ్ తో గతంలో పెరియేరుమ్ పేరుమాల్ అనే తమిళ సినిమా మిస్ చేసుకుంది. దీంతో అనుపమ కొన్నేళ్లుగా నిరాశ చెందింది. ఆయనతో పని చేసే అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసిందట. అలా కొన్నేళ్లకు మళ్లీ అదే డైరెక్టర్ తో బైసన్ లో నటించే ఛాన్స్ దక్కించుకుంది. ఈ విషయం గురించి మాట్లాడుతూ.. నేను ప్రేమమ్ చేసినప్పుడు, నాకు సినిమా గురించి ఏమీ తెలియదు. ప్రతిదీ కొత్తగా, ఏదో మాయాజాలంగా అనిపించింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత, బైసన్ ఫొటో షూట్ సమయంలో నేను మళ్లీ అలాగే ఫీల్ అయ్యాను. అని అనుపమ చెప్పింది. అని తన పదేళ్ల కెరీర్ ను సింపుల్ గా వివరించింది. కాగా, ఇప్పుడు ఆమె కొత్త సినిమా బైసన్ విడుదలకు రెడీ అయ్యింది. రేపే థియేటర్లలోకి వస్తున్నా.. అనుమలో ఎలాంటి ఆందోళన, భయం కనిపించడం లేదు. ఆమె ప్రశాంతంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అతిగా ఆలోచించడం లేదు. ఫలితం ఏదైనా స్వీకరించడానికి రెడీ అన్నట్లు కనిపించింది. ఆ క్రంలోనే విధి తనను ఊహకు మించి ఉన్నత శిఖరాల్లోకి తీసుకెళ్లిందని చెప్పింది.

# సాగర కన్యగా ఇస్మార్ట్ బ్యూటీ..!



ఒంటికి అంటుకుపోయినట్టుగా వేసుకున్న అమ్మడి డ్రెస్.. పరువాలకు పనిచెబుతూ నభా చేస్తున్న ఈ గ్లామర్ షో ఆమెకు మంచి మైలేజ్ తెచ్చి పెట్టేలా చేస్తుంది. ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ చేసిన తక్కువ సినిమాలతోనే తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. కన్నడలో వరుస 3 సినిమాలు చేసి ఆ తర్వాత తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఐదేళ్ల కెరీర్ లో 7 సినిమాలు చేసింది. వాటిలో ఇస్మార్ట్ శంకర్ తప్ప మరో సినిమా ఆమెకు క్రేజ్ తీసుకు రాలేదు. 2021 లో మ్యాస్ట్రో సినిమా చేసిన నభా నటేష్ ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. మధ్యలో ఒక యాక్సిడెంట్ వల్ల ఆడియన్స్ కు దూరంగా ఉన్న అమ్మడు ఫైనల్ గా మళ్లీ తన గ్లామర్ ట్రీట్ తో అలరిస్తుంది. దంకీలో టామ్ క్రూజ్ స్టంట్ కావాలన్న ఫ్యాన్ సినిమాలు చేసినా చేయకపోయినా నభా నటేష్ సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ మాత్రం అదరగొట్టేస్తుంది. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ చూసిన ఎవరైనా సరే ఆమె మాయలో పడక తప్పదు. సినిమా ఛాన్స్ లు రావట్లేదా లేక తనే కావాలని చేయట్లేదా అన్నది తెలియదు కానీ ఫోటో షూట్స్ తోనే సరి పెట్టుకుంటుంది నభా నటేష్. ఇక లేటెస్ట్ గా స్కిన్ టైట్ డ్రెస్ తో మరోసారి వావ్ అనిపించేలా చేసింది అమ్మడు. ఒంటికి అంటుకుపోయినట్టుగా వేసుకున్న అమ్మడి డ్రెస్.. పరువాలకు పనిచెబుతూ నభా చేస్తున్న ఈ గ్లామర్ షో ఆమెకు మంచి మైలేజ్ తెచ్చి పెట్టేలా చేస్తుంది. క్రీం కలర్ డ్రెస్ లో సాగర కన్యలా అలా నభా చూసే చూపులకు ఎలాంటి వారైనా సరే డిస్టర్బ్ అవ్వాల్సిందే అని చెప్పొచ్చు. సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ వల్లే 5 మిలియన్స్ దగ్గర దాకా ఫాలోవర్స్ ని ఏర్పరచుకుంది అమ్మడు. ఏరుకున్న హీరో ప్రస్తుతం నభా నటేష్ లేటెస్ట్ ఫోటో షూట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ తోనే ఇంత హంగామా సృష్టిస్తుంటే నభా వరుస సినిమాలు చేస్తే మాత్రం స్టార్ రేంజ్ కి వెళ్లడం పక్కా అని చెప్పొచ్చు. ఇక అమ్మడి సినీ కెరీర్ అంత దూకుడుగా లేకపోయినా ఆమె చేస్తున్న ఫోటో షూట్స్ తోనే నభా గ్రాఫ్ పెరుగుతుంది. కచ్చితంగా కొద్దిగా వెయిట్ చేస్తే మాత్రం నభా నటేష్ కి మంచి అవకాశాలు వస్తాయని చెప్పొచ్చు. అప్పటిదాకా నభా నటేష్ ఫోటో షూట్స్ తోనే ఆమె ఫ్యాన్స్ అడ్జెస్ట్ అవ్వాల్సిందే మరి.

# రష్మికకు మద్దతుగా నాగచైతన్య-మృణాల్

రష్మిక మందన్న డీప్‌ఫేక్ వీడియో వైరల్ కావడంతో చాలా మంది కృత్రిమ మేధస్సును తప్పుగా ఉపయోగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ మాత్రమే కాదు, రష్మిక మందన్న స్నేహితులు సహచరులు పెద్ద ఎత్తున మద్దతుగా ముందుకు వచ్చారు. రష్మిక డీప్‌ఫేక్ వీడియోని నిజమైనదిగా అమాయ ప్రజలు భావించే వీలుంది. అందుకే రష్మిక వెంటనే వీడియోపై స్పందించారు. ఇప్పుడు అక్కినేని నాగ చైతన్య సహా మృణాల్ ఠాకూర్, చిన్మయి శ్రీపాద వంటి చాలా మంది ప్రముఖులు కృత్రిమ మేధస్సు దుర్వినియోగం గురించి మాట్లాడటానికి ముందుకు వచ్చారు. %ూఎజవత్‌అంవఎవత్‌ూశ్రీంశీ =ముం% - రష్మిక ఫేక్ వీడియో.. ఒరిజినల్ గర్ల్ ఏమంది అంటే? మార్ఫింగ్ ఫోటోపై రష్మిక చేసిన ట్వీట్‌కు ప్రతిస్పందనగా నాగ చైతన్య ఇలా రాశాడు. "టెక్నాలజీని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో చూడటం నిజంగా నిరుత్సాహపరుస్తుంది. భవిష్యత్తులో ఇది ఏ విధంగా అభివృద్ధి చెందుతుందోననే ఆలోచన మరింత భయానకంగా ఉంది. ఘటనపై చర్యలు తీసుకోవాలి.. ఇలాంటివి ఆపేందుకు చట్టం చేయాలి. దీని బారిన పడే వ్యక్తులను రక్షించడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి" అని రాసారు. తనకు మద్దతుగా నిలిచినందుకు చైతన్యకు రష్మిక ధన్యవాదాలు తెలిపింది.వార్నీ.. ఈ పొలిమేర చాలా దూరం వెళ్లేలా ఉందే! రష్మిక ఘటన అనంతరం మృణాల్ ఠాకూర్ సోమవారం అర్థరాత్రి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక నోట్ రాశారు. అందులో ఇలా ఉంది. "ఇలాంటివాటిని ఆశ్రయించే వ్యక్తులకు సిగ్గుండాలి. అలాంటి వారిలో మనస్సాక్షి అస్సలు ఉండదని ఇది చూపిస్తుంది. ఇప్పటివరకు మనం చాలా గ్లింప్సెస్ చూసిన ఈ సమస్యను పరిష్కరించినందుకు ఏరష్మిక మందనకు ధన్యవాదాలు. మనం మౌనంగా ఉంటున్నాం. ప్రతిరోజూ మహిళా నటీనటుల మార్ఫింగ్, ఎడిట్ చేయబడిన వీడియోలు ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమవుతూనే ఉన్నాయి. అతుకులు వేసిన శరీర భాగాలను జూమ్ చేస్తూ.. సోషల్ మీడియాల్లో తిరుగుతూనే ఉన్నాయి. మనం ఒక సంఘంగా, సమాజంగా ఎటువైపు పయనిస్తున్నాము? అన్నది ముఖ్యం. మనం ప్రముఖంగా నటీమణులం కావచ్చు కానీ రోజు చివరిలో మనలో ప్రతి ఒక్కరూ మనుషులం. మనం దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు? మౌనంగా ఉండకండి.. ఇప్పుడు సమయం ఇంకా లేదు! అని మృణాల్ రాసారు. విశ్వక్ 'గామి'.. రన్ టైమ్ ఫిక్స్ దేశవ్యాప్తంగా అవగాహన కల్పించాలి ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు గాయని చిన్మయి శ్రీపాద %శ%పై ఒక నోట్ రాశారు. ఆమె %శ% లో ఇలా రాసింది. "చాలా నెలల క్రితం, జైలర్ నుండి కావాలాకి ప్రదర్శించిన %ూX% అవతార్‌లో మనందరికీ అత్యంత ఇష్టమైన నటీమణుల్లో ఒకరి వీడియో విడుదలైంది. అది ఆమె కాదు. ఇది డీప్ ఫేక్. కావాలా డీప్ ఫేక్ రెండరింగ్‌లో ఉపయోగించేందుకు శ్రీమతి సిమ్రాన్ తన పోలికను ముందుగానే అంగీకరించిందో లేదో ఎవరికీ ఖచ్చితంగా తెలియదు. ఆమె తన సోషల్ మీడియా పేజీలలో కూడా షేర్ చేసింది. నడుము, నాభి అందాలతో కవ్వింపులు ఇప్పుడు మరో డీప్‌ఫేక్ వీడియో తెరపైకి వచ్చింది. రష్మిక బాధితురాలు. నేను ఆమె ఇన్‌స్టాగ్రామ్ కథనాన్ని చూశాను. అక్కడ ఆమె నిజంగా కలవరపడుతోంది. ప్రతిరోజూ మహిళల శరీరాలు దోపిడీకి గురవుతున్న దేశంలో, డీప్ ఫేక్ వాళ్లు లక్ష్యంగా చేసుకోవడానికి వేధించడానికి బ్లాక్‌మెయిల్ చేయడానికి ఉపయోగించే నెక్స్ట్ లెవల్ ఆయుధం. అమ్మాయిలను బలవంతంగా దోచుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం, అత్యాచారం చేయడం, ఒక చిన్న గ్రామం లేదా పట్టణంలోని వారి క్లూ లేని కుటుంబాలు మానమ్ లేదా గౌరవం ఎప్పుడు ప్రమాదంలో పడుతుందో అర్థం చేసుకోలేరు. రుణ యాప్‌లు పోర్న్ ఫోటోల ద్వారా వారి ముఖాల ఫోటోషాప్ చేసిన ఫోటోలతో రుణగ్రహీతలను వేధిస్తాయి. వారు దానితో వేగలేరు. కానీ ఒక డీప్ ఫేక్ అనేది సాధారణ శిక్షణ లేని కంటికి గుర్తించడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రతి ఒక్కరికి అధిక-ప్రదర్శనలు ఉండవు. దేశవ్యాప్త అవగాహన ప్రచారం అవసరమని నేను నిజంగా భావిస్తున్నాను. దీని ద్వారా అవగాహన కల్పించడానికి అత్యవసరంగా ప్రారంభించాలి.





# బుల్లి తెర నటి సూపర్ హాట్ ట్రీట్!

బుల్లి తెర భామలు కూడా హీరోయిన్లకు ఏమాత్రం తక్కువ కాదు. అవకాశం రాక బుల్లి తెరపై ఉండాల్సి వచ్చింది. లేకుంటే? వెండి తెరపై అంతకు మించిన గ్లామర్ ట్రీట్ తో అలరించే భామలెంతో మంది ఉన్నారు. బుల్లి తెరపై గ్లామర్ కి ఆస్కారం లేదు కాబట్టి చాలా మంది భామలు ఆఫ్ ది స్క్రీన్ లోనూ అంతే ట్రెడిషనల్ గా కనిపిస్తుంటారు. ఆ ఫ్ ది స్క్రీన్ లోనూ బోల్డ్ బ్యూటీలుగా ఫేమస్ అయితే ఆ ప్రభావం సీరియల్స్ అవకాశాలపై పడుతుంది. దంకీలో టామ్ క్రూజ్ స్టంట్ కావాలన్న ఫ్యాన్ కానీ ఈ నటి మాత్రం అవేం పట్టించుకోకుండానే గ్లామర్ ఎలివేషన్ లో సత్తా చాటింది. 'గుప్పెడంత మనసు' సీరియల్ నటి జ్యోతిరాయ్ సుపరిచితులే. సీరియల్స్ లో వయసు ముదురిన పాత్రలు పోషిస్తుంటుంది. అమ్మ..అక్క వదిన అంటూ డీసెంట్ పాత్రల్లో కనిపిస్తుంటుంది. కానీ సొగసరి ఆఫ్ ది స్క్రీన్ మాత్రం ఆ రోల్స్ కి భిన్నంగా గ్లామర్ ట్రీట్ తో అలరిస్తుంది. కన్నడ బోల్డ్ అటెంప్ట్ చూసి అంతా స్టన్ అవుతున్నారు. %ూత్రీంశీ =ముం% - థియేటర్లో విసిరేసిన డబ్బులు ఏరుకున్న హీరో వివరాల్లోకి వెళ్తే జ్యోతిరాయ్' (ప్రెట్టీ గర్ల్' అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. అలాగే 'మాస్టర్ పీస్' అనే సినిమాలోనూ నటిస్తోంది. ఈ సినిమా దర్శకుడితో అమ్మడు డీప్ లవ్ లో ఉన్నట్లు కథనాలు వేడెక్కిస్తున్నాయి. తాజాగా అమ్మడు ఇన్ స్టాని షేక్ చేసే కొన్ని స్టిల్స్ లో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా స్కిన్ టైట్ ఫిట్ దుస్తుల్లో అందాల వర్షంతో విందు ఇచ్చింది. నాభి అందాల్ని హైలైట్ చేస్తూ కెమెరాకి ఫోజులిచ్చింది. భారీగా మ్యాకప్ తో అమ్మడు వయసును పూర్తిగా దాచేసింది. ఈమె సీరియల్స్ చేసే జ్యోతిరాయ్ నా? అన్న సందేహం కలగక మానదు . ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జ్యోతి ఫాలోవర్లు తనివి తీరా చూసి తరిస్తున్నారు. ఇలాంటి పిక్స్ మోర్ అండ్ మోర్ కావాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.